


## అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

నాణ్యత ప్రమాణాలతో పనుల వేగం పెంచాలి

ఖమ్మంలో మంత్రి పొంగులేటి సుడిగాలి పర్యటన

ఖమ్మంనగరంలో సిసి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి


ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# ప్రభాత వార్త

బుధవారం 25, సెప్టెంబర్ 2024 16 పేజీలు




# ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు

16 లో..

ఖమ్మం నగర ఓర్ఆర్ఆర్‌కు అవసరమైన సర్వీస్‌రోడ్ల ఏర్పాటుకు చర్యలు

ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పునరుద్ధరణకు 100రోజుల సమయం

నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నూతన డిజైన్ రూపకల్పన

అత్యధిక జాతీయ రహదారులు ఉన్న జిల్లాగా ఉమ్మడి ఖమ్మం

విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త :
జాతీయ రహదారులతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు, ఖమ్మం ఓఆర్ఆర్,సర్వీస్ రోడ్ల నిర్మాణం అంశంపై, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు.

# భద్రాద్రిలో భారీగా.. గంజాయి పట్టివేత



2వ పేజీలో...

రూ.కోటి విలువ చేసే గంజాయి, వాహనాలు స్వాధీనం

కీలక నిందితుడు మునవర్ అలీతో 9 మంది అరెస్టు

నిందితుల్లో ఒక కుటుంబం ఉండడం విశేషం

పరారీలో మరో నలుగురు నిందితులు

వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి

భద్రాచలం, ప్రభాతవార్త :
భద్రాచలం మీదుగా భారీగా తరలివెళ్తున్న గంజాయి రవాణాకు ఎక్సైజ్ శాఖ, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు అడ్డుకట్ట వేశారు.

# బూరుగ్గుంపులో.. విషాదం

## పిడుగుపాటుకు ఇద్దరు యువతులు దుర్మరణం

మరొకరి పరిస్థితి విషమం

గిరిజన కుటుంబాలలో అలుముకున్న విషాదచాయలు

దమ్మపేట రూరల్ ,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :
మంగళవారం కురిసిన అకాలవర్షానికి ఇద్దరు గిరిజన యువతులు పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఘటన స్థానిక మండల పరిదిలోని జగ్గారం పంచాయితీ, బూరుగ్గుంపు గ్రామంలో చోటుచేసుకుంది. పర్యవసానంగా ఇద్దరు యువతులు కట్టం నాగశ్రీ(22), సున్నం అనూష(23) మృతిచెందగా, మడకం సీతమ్మ అనే మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగ్గారం గ్రామంలో కౌలు వ్యవసాయం చేసుకుంటూ ఉన్న రవిరాజా అనే రైతు చేనులోకి వ్యవసాయ పనులనిమిత్తం కొందరు కూలీలు ఎప్పటిలాగానే వెళ్ళారు. అకస్మాత్తుగా భారీగా వచ్చిన వర్షానికి తలదాచుకోవడానికి దగ్గరలో ఉన్న చెట్లకిందకు



2 లో..

# వచ్చేనెల 9న కార్మికులకు లాభాల బోనస్

- ఈ నెల జీతంతో పండుగ అడ్వాన్స్.. ఒక్కొక్కరికి రూ.25 వేలు
- కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లింపుపై తక్షణమే విధివిధానాలు ఖరారు
- అధికారులను ఆదేశించిన సీఎండీ బలరాం



2వ పేజీలో...

కొత్తగూడెం, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కారఇ్మకులకు ఇటీవల ప్రకటించిన 33 శాతం లాభాల వాటా బోనస్‌ను వచ్చేనెల 9వ తేదీన చెల్లించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు

# భద్రాద్రిలో భారీగా గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి..)

ఒకే రోజు ఐదు సంఘటనల్లో 319 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రవాణాకు పాల్పడిన 10 మంది నిందితులు పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. వీరిలో ఒక కుటుంబం పూర్తిగా గంజాయి వ్యాపారంపైనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి వెలుగు చూసింది. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమీషనర్ జనార్ధన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఆంధ్ర, ఒడిస్సా బార్డర్ (ఏవోబీ) నుంచి హైద్రాబాద్‌కు తరలిస్తున్న 319 కేజీల గంజాయిని భద్రాచలం ఎక్సైజ్ శాఖ పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న రెండు కార్లు, ఒక స్కూటీని, రెండు బైకులను, సెల్‌ఫోన్‌లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.79.75లక్షలు, రెండు కార్లు, స్కూటీ, బైక్ విలువ రూ.21లక్షలు మొత్తంగా రూ.కోటి ఉంటుందని అంచనా వేశారు. ఏపీ పసుపులంక నుంచి హైద్రాబాద్‌కు స్కూటీపై తరలిస్తున్న 14 కేజీల గంజాయిని, చింతూరు నుంచి హైద్రాబాద్‌కు కారులో తరలిస్తున్న 100 కేజీలు, ఏపీలోని మోతుగూడెంనుంచి హైద్రాబాద్‌కు కారులో తరలిస్తున్న 180 కేజీల గంజాయిని భద్రాచలం చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారనా, పట్టుకున్నారు. మరో రెండు కేసుల్లో 25 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు వెల్లడించారు. 14 కేజీల గంజాయిని హైద్రాబాద్ తరలిస్తున్న క్రమంలో ఫతేనగర్ బాలానగర్‌కు చెందిన శక్తి రాహుల్, గోపిశెట్టి అక్షిత్‌లను అరెస్టు చేశారు. 100 కేజీల గంజాయిని పట్టుకున్న కేసులో పెద్దపల్లిజిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తల్లి కుమారులు నేరెళ్ల అపర్ణ, నేరేళ్ల అఖిల్‌లను అరెస్టు చేశారు. 180 కేజీల గంజాయి కేసులో బేగం బజార్‌కు చెందిన దత్తు పంచాల్‌ను అరెస్టు చేశామని ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జీ.గణేష్ ఈ.ఎస్.జానయ్య తెలిపారు.

**-నిందితుల్లో ఒక కుటుంబం ఉండడం విశేషం**

కుటుంబపోషణ కోసం అనేక మార్గాలు. కానీ ఈ కుటుంబం అక్రమ ధనార్జనే ధ్యేయంగా గంజాయి సరఫరాను ఎంచుకున్నారు. వివరాలలోకి వెళితే .. పెద్దపల్లిజిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల సదయ్య అనే వ్యక్తి అక్రమ గంజాయి రవాణాకు పాల్పడి జైలు పాలయ్యాడు. దీంతో అతని భార్య అపర్ణ రంగంలోకి దిగి గంజాయి రవాణాకు తెరలేపింది. అదేవిధంగా తమ కుమారుడు నేరళ్ల అఖిల్‌ను సైతం దింపి యధేశ్చగా గంజాయి రవాణా కొనసాగిస్తున్నారు. వీరికి సదయ్యకు మిత్రుడైన నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ మునవర్ అలీ అనే వ్యక్తి చేతులు కలిపాడు. వీరు 2017లో విజయవాడలోని భవానీపురం పోలీసు స్టేషన్‌లో గంజాయి రవాణా కేసులో అరెస్టు కాబడి జైలుకు సైతం వెళ్ళారు. అయినా తమ తీరు మార్చుకోని సదయ్య కుటుంబం, మునవర్ అలీ ఇదే దందాను కొనసాగిస్తూ మహారాష్ట్ర, నిజామాబాద్ మొదలైన ప్రాంతాల్లో అమ్ముకాలు సాగిస్తూ వచ్చారు. ఈ క్రమంలో నేరేళ్ల అపర్ణ ఆమె కుమారుడు నేరేళ్ల అఖిల్ ఇద్దరు నిజామాబాద్‌కు చెందిన మునవర్ అలీ కోసం గంజాయి తరలిస్తూ ఉండగా భద్రాచలంలో నమ్మదగిన సమాచారంతో దాడి చేసి వీరి దందాకు తెరదింపారు. మునవర్ అలీ అనే వ్యక్తిపై 2007వ సంవత్సరం నుంచి నేటి వరకు దాదాపు పది అక్రమ గంజాయి కేసులు రవాణా నమోదు అయ్యాయినట్లు ఎక్సైజ్ అధికారుల విచారణలో తేలిందని వెల్లడించారు. గంజాయి రవాణా చేస్తున్న ముఠాను చాకచక్యంగా పట్టుకోవడానికి కృషి చేసిన పట్టణ ఎక్సైజ్ సీఐ రహిముస్సీ సాభేగం, ఎస్సైలు రమేష్,కే.గౌతం, అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్‌అలీం, కానిస్టేబుళ్ళు కే.బాబు, వీరబాబు, రాకేష్,కిరణ్‌కుమార్, నాగేశ్వరరావులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీ.బీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఉన్నతాధికారులు అభినందించారు.

# బూరుగ్గుంపులో విషాదం

(మొదటి పేజీ తరువాయి..)

కూలీలు వెళ్ళారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కావడంచేత పిడుగులు కూలీలకు అతి సమీపంలో పడినట్లు సమాచారం ఉంది. ఐతే కౌలు రైతు హుటాహుటిన మానవత్వంతో సత్తుపల్లి విజేత ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కట్టం నాగశ్రీ(22), సున్నం అనూష(23) మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మడకం సీతమ్మ పరిస్థితి ఆందోళనగా ఉండటంతో ఖమ్మం వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. ఎప్పటిలాగానే కూలీపనులకు వెళ్ళి తిరిగి వస్తుందనుకునే గ్రామస్థులకు ప్రమాదం జరిగిన సంగతి తెలిసి బోరున విలపించారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనూష డిగ్రీ వరకు, నాగశ్రీ ఇంటర్ వరకు చదువులు పూర్తిచేసుకొని ఎటువంటి జీవనోపాధి లేకపోవడంతో కుటుంబ ఆసరాకోసం కూలీపనులకు వెళుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

**చరవాణీలో ఎంఎల్ఏ జారే :**

ప్రైవేట్ కార్యక్రమంలో ఉన్న అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణకు వెంటనే చరవాణీ ద్వారా సమాచారం రావడంతో సత్తుపల్లి లోని వైద్యులను అప్రమత్తం చేశారు. మెరుగైన వైద్యం అందించాలని, గిరిజనులకు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని వైద్యులను కోరారు. చివరికి ఇద్దరు మృతి చెందిన విషయం తెలుసుకొని వారి కుటుంబాలకు తన సంతాపం వెలిబుచ్చారు.

**రాష్ట్ర ఆదివాసీ మాజీ కన్వీనర్ కారం శ్రీరాములు తీవ్రదిగ్భ్రాంతి**

విషయం తెలుసుకున్న రాష్ట్ర ఆదివాసీ మాజీ కన్వీనర్ కారం శ్రీరాములు వెంటనే సంఘటనా ప్రదేశానికి చేరుకొని క్షతగాత్రులను ప్రైవేట్ వైద్యశాలకు తరలించడంలో సహకరించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అకాలమరణానికి మృతుల కుటుంబాలకు తీవ్రసంతాపం వెలిబుచ్చారు. స్థానికుల సమాచారం మేరకు పోలీస్ ఎస్సై సాయికిషోర్ రెడ్డి కేసునమోదు చేసుకొని విచారణ చేపట్టారు.



## బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ఖమ్మం కల్చరల్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

ఖమ్మంలో మున్నేరు వరద బాధితులకు ఖమ్మం వివేకానంద ఇన్‌స్టాఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ విద్యాలయం నందలో నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రామకృష్ణ మఠం బాధ్యులు శ్రీ పూజానంద స్వామీజీ పాల్గొని వితరణ కిట్లు అందజేశారు. మున్నేరు పరివాహక ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి స్థాయిలో నష్టం జరిగిన మరో 500 మంది మొత్తం 1000కుటుంబాలకు 25కేజీల బియ్యం, కందిపప్పు, నూనె, సబ్బులు,సర్ఫ్, కారం, పసుపు, గిన్నెలు, ప్లేట్లు, బకెట్ అండ్ మగ్గు కూడిన కిట్లును ఇవ్వడం జరిగింది. స్వామీజీ మాట్లాడుతూ ఖమ్మంలో జరిగినటువంటి ఈ విపత్తు చాలా బాధాకరమని చాలా మంది నిరాశ్రయులయ్యారని వారి సహాయార్థం నిత్యావసర వస్తువులు సంబంధించిన కిట్లు ఇచ్చి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం వివేకానంద ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ డైరెక్టర్ శ్రీ వాసుదేవరావు మాట్లాడుతూ ఖమ్మం ఇటువంటి సేవా కార్యక్రమానికి సహకరించిన రామకృష్ణ మఠానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సంస్థ చేస్తున్నటువంటి వివిధ శిక్షణ కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు చంద్రశేఖర్ జయంతి, పటేల్,రాముడు, ఆశోక్, రాధాకృష్ణ, రాగిణి,స్నేహ, కళ్యాణి, లలిత, మండే నరసింహారావు, చారి దుర్గాప్రసాద్, సున్నారవి, భద్రం,వీరభద్రం వాలంటీర్స్ పాల్గొన్నారు.

# పంట నమోదు తప్పనిసరి



**- త్వరలోనే డిజిటల్‌క్లాక్ సర్వే చేపడతాం**

**- పంటనమోదును త్వరగా పూర్తిచేయాలి**

**- మణుగూరులో పంటనమోదును పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు**


**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :** రైతులు తప్పనిసరిగా పంటనమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు అన్నారు. ఆయన మంగళవారం మణుగూరు మండలం అన్నారం గ్రామంలో పంటనమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం రైతుభరోసాలో భాగంగా రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకునేందుకు తమ పంట వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదుచేసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా పంటనమోదు చేసుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారన్నారు. రైతులు సాగుచేస్తున్న అన్ని పంటల వివరాలు అధికారులకు అందజేయాలన్నారు. త్వరలోనే డిజిటల్ క్లాక్ సర్వే కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. తొలుత పంటనమోదు కార్యక్రమంపై వ్యవసాయ అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని త్వరతగతిన నమోదు కార్యక్రమం పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ఛటర్జీ, ఏఈవో కొమరం లక్ష్మణరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్లగూడెం పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడలు ముగింపు

**దుమ్ముగూడెం, ప్రభాతవార్త :** దుమ్ముగూడెం మండలంలోని ఆర్లగూడెం గ్రామంలో ఉన్న గిరిజన బాలుర వసతి గృహంలో జోనల్ స్థాయి పాఠశాల విద్యార్థుల క్రీడలు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. కాగా మంగళవారం జోనల్ స్థాయి క్రీడలు విజయవంతంగా ముగిసినట్లు జోనల్ స్థాయి కన్వీనర్ ఆర్లగూడెం హెచ్.ఎం సోమశేఖర్ తెలిపారు. క్రీడల ముగింపు కార్యక్రమానికి ఎంఈవో సున్నం సమ్మయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. జోనల్ స్థాయిలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో జరిగే జిల్లా స్థాయి పాఠశాల క్రీడా పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో దశమిబాబు, క్రీడాధికారి గోపాల్‌రావు, వెంకట్, నారాయణ, నాగేశ్వరరావు, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాలకు చెందిన వివిధ పాఠశాల పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చేనెల 9న కార్మికులకు లాభాల బోనస్

(మొదటి పేజీ తరువాయి..)



చేస్తోంది. అమెరికా నుంచి వీసీ ద్వారా సంస్థ సీఎండీ బలరాం మంగళవారం ఉదయం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల సీఎం, డిప్యూటీ సీఎంలు మంత్రివర్గంతో కలిసి సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాల్లో 33 శాతాన్ని అనగా రూ.796 కోట్లులాభాల వాటా బోనస్‌గా ప్రకటించారు. సింగరేణి చరిత్రలో ఇది అత్యధం కావడం విశేషం. సంస్థలో పనిచేస్తున్న 42 వేల మంది అధికారులు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తాము పనిచేసిన పనిదినాల సంఖ్యను పరిగణలోకి తీసుకొని లాభాల వాటా బోనస్ చెల్లిసానతరు. సగటున ఒక్కొక్కరు సుమారు లక్షా తొంబై వేల రూపాయలు చొప్పున లాభాల వాటా బోనస్‌ను పొందే అవకాశం ఉంది.

**-తొలిసారిగా కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా...**

సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు లాభాల వాటా బోనస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా విధి విధానాలను రూపొందించాలని సీఎండీ ఆదేశించారు. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరంలో వివిధ కాంట్రాక్టర్ల వదనద పనిచేసిన వారి వివరాలు, వారి సమాచారాన్ని పూర్తిగా సేకరించాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పండుగకు ముందే వారికి కూడా బోనస్ చెల్లింపు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.

**- ఈ నెల జీతంతో పండుగ అడ్వాన్స్.. ఒక్కొక్కరికి రూ.25 వేలు**

లాభాల వాటా బోనస్‌తో పాటు సింగరేణి సంస్థ ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా దసరా పండుగ అడ్వాన్స్‌ను సింగరేణి ఉద్యోగులకు చెల్లించాలని సీఎండీ ఆదేశించారు. ఒక్కొక్కరికి రూ.25 వేలు పండుగ అడ్వాన్స్‌ను చెల్లించనున్నారు. దీని కోసం సంస్థ రూ.95 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. సెప్టెంబర్ నెల జీతాలతో పాటే ఈ పండుగ అడ్వాన్స్ సొమ్మును కూడా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

**- లాభాల వాటా బోనస్ పండుగ అడ్వాన్స్ చెల్లింపునకు రంగం సిద్ధం...**

లాభాల వాటా బోనస్, పండుగ అడ్వాన్స్‌లు కలిపి దాదాపు రూ.900 కోట్లను సింగరేణి ఉద్యోగులకు చెల్లించనున్న నేపథ్యంలో సింగరేణి సిబ్బంది వ్యవహారాలు, ఆర్థిక విభాగాలు తగు ఏర్పాట్లు చేయాలని సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.

# ఘన, ద్రవపదార్థాలపై అవగాహన



దుమ్ముగూడెం, ప్రభాతవార్త :
ఐటీసీ, ఎమ్మెస్కే వాష్ సంస్థ ఆధ్వర్యంలో దుమ్ముగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఐటీసీ బంగారు భవిష్యత్తు వాష్ ప్రోగ్రాం ద్వారా పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడబ్ల్యూలకు ఘన, ద్రవ పదార్థాల నిర్వహణపై మంగళవారం ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దుమ్ముగూడెం మండల ఎంపీవో రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెస్కే వాష్ సంస్థ ప్రతినిధులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఖచ్చితంగా ఉండాలని, తడి, పొడి చెత్త వేరే చేయడం, పారిశుద్ధ్య పనులు ఖచ్చితంగా నిర్వహించాలని, గ్రామీణ నీరు, మలవ్యర్థాల నిర్వహణపై అవగాహణ కల్పించారు. గ్రే వాటర్, బ్లాక్ వాటర్ గురించి వివరించారు. గ్రే వాటర్ నిర్వహించకపోతే వచ్చే సమస్యలపై, వాటి ప్రయోజనాలపై సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుకన్య, ప్రోగ్రాం అధికారి పీవో గీత, సాగర్, ఏపీవో సునీల్‌బాబు, వెంకటేశ్వర్లు, వెంకట్‌రావు, రాజుకుమార్, ప్రమోద్, ప్రసాద్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, మల్టీ పర్పస్ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు



### మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన సాబీర్‌పాషా

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:
మండలంలోని బంగారుచెలక మాజీ సర్పంచ్ తాటి రాధ భర్త, సీపీఐ సీనియర్ నాయకుడు తాటి వెంకటేశ్వర్లు సోమవారం అర్ధరాత్రి అకాల మరణం చెందగా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఆయన వెంట నేరెళ్ల రమేష్, లగడపాటి రమేష్‌చంద్, దారా శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు తేలిక పుల్లయ్య, కంటెం శేఖర్, తాటి హరీష్, జోగా రాజబాబు, కుంజా ముత్తయ్యలు ఉన్నారు.



### అనుమతులు లేని కట్టడాలు,కబేలాలపై చర్యలు తీసుకోవాలి

భద్రాచలంక్రైం, ప్రభాతవార్త :
దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన పవిత్ర క్షేత్రమైన భద్రాచలం నగరంలో ఉన్నటువంటి అక్రమ అన్యమత కట్టడాలను, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కబేలాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం విశ్వహిందూ పరిషత్ భద్రాచలం కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యనిర్వహణ అదికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన పంచాయతీ అధికారి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒరుగంటి సురేష్, గడిదేశి వెంకటేశ్వర్లు, గంగాధరి సీత, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, తిరుపతిరావు, ఏ.కే.నాయుడు, రాఘవ, దుర్గా గణేష్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత



బూర్గంపహాడ్, ప్రభాతవార్త :
స్వచ్ఛ సేవా హే స్వచ్ఛ స్వభావం - స్వచ్ఛ సంస్కారం వారోత్సవాలలో భాగంగా క్విజ్, ఆటల పోటీలను స్థానిక ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం గ్రమాపంచాయతీ, ఐటీసీ వాష్ సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరస్పాండెంట్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ .. ఒక్క అడుగు స్వచ్ఛత వైపు వేసి మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే మనం పూర్తిగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. మన పరిసరాలు ఎల్లాప్పుడూ శుభ్రంగా ఉంచుకోవడం మన కర్తవ్యం అని, శుభ్రతే మన సౌభాగ్యం, స్వచ్ఛతలో భాగం అయ్యి స్వచ్ఛతా సౌదాన్ని నిర్మిద్దామని అన్నారు. విద్యార్థులకు మొక్కలను, బహుమతులను ఆయన చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఐటీసీ వాష్ ప్రతినిధులు రోజా, రజిత, పాఠశాల హెడ్ మాస్టర్ ఎన్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :



దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సీ.హెచ్.కృష్ణవేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ .. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, విపత్తు సమయాల్లో సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆమె తెలిపారు. సీనియర్ తెలుగు అధ్యాపకుడు పీడీ వరరాజు, బోటని అధ్యాపకుడు పవన్‌కుమార్‌లు మాట్లాడుతూ .. ఎన్ఎస్ఎస్ డే గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో ఆర్లగూడెం మాజీ సర్పంచ్ మృతి

**-భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన పలువురు నాయకులు**

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :
దుమ్ముగూడెం మండల పరిధిలోని పెద్దఆర్లగూడెం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొర్సా రమేష్ (50) గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. మాజీ సర్పంచ్ హఠాన్మరణంపై ఏజెన్సీ ప్రాంతంలో విషాధఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని భద్రాచలం శాసనసభ్యుడు డా.తెల్లం వెంకట్రావు సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. అలాగే సీపీఐ పార్టీ నాయకులు రావులపల్లి రవికుమార్, టీఆర్ఎస్ పార్టీ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, రావులపల్లి పృధ్వీ, కాంగ్రెస్ పార్టీ కుంజా శ్రీనివాస్, లంకా శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, దుమ్ముగూడెం సొసైటీ చైర్మన్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కొర్సా రమేష్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

# పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారుడికి రూ.30వేలు ఆర్థిక సహాయం

భద్రాచలంటౌన్ ప్రభాతవార్త :
ఇటీవల యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో భారతదేశానికి బంగారు పతకాన్ని సాధించిన పట్టణంలోని సిటీస్టైల్ జిమ్‌కు చెందిన మోడెం వంశీకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు రూ.30వేల ఆర్థిక సహాయం చేశారు. అక్టోబర్ 4 నుంచి 13వ తేదీ వరకు సౌత్ ఆఫ్రికాలోని సిటీలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు మోడెం వంశీ ఎంపిక కాగా రానుపోను ఖర్చుల నిమిత్తం పట్టణానికి చెందిన వేగేశ్న శ్రీనివాసరాజు ద్వారా ఈ ఆర్థిక సహాయాన్ని చేశారు. ఈ సందర్భంగా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యుల తరుపున వేగేశ్న



శ్రీనివాసరాజు, ఫౌండేషన్ వైస్ చైర్మన్ డా.శివరామకృష్ణప్రసాద్, చైర్మన్ మంతెన వెంకటరమరాజులకు ధన్యవాదాలు తెలియజేశారు.

### ప్రమాద బాధితులకు అండగా యువజన కాంగ్రెస్

**-రూ.10వేల ఆర్థిక సహాయం అందజేత**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త :



బూర్గంపహాడ్ మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కావడంతో సర్వం కోల్పోయిన వెంకటేష్ కుటుంబానికి యువజన కాంగ్రెస్ నేత మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, నియోజకవర్గ యువజన నాయకుడు ఎడమకంటి సుధాకర్‌రెడ్డిలు అండగా నిలిచారు. వారికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. వారితో పాటు స్థానిక మాజీ ఉపసర్పంచ్ సందే గోవింద్, మండల యువజన నాయకుడు నిమ్మల హరీష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.




# ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాల్సిందే -టీజేఎస్

భద్రాచలం, (ప్రభాతవార్త) : భద్రాచలం నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో టీజేఎస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలు నిర్వహించనున్నట్లు టీజేఎస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు తెలిపారు. మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమ నాయకుడు తిప్పన సిద్దులు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ ఐదు గ్రామపంచాయతీలతోనే భద్రాచలం అభివృద్ధి ముడిపడి ఉందని అన్నారు. ఈ విషయంపై ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకారానికి రావాలని కోరారు. గ్రామపంచాయతీల విలీనం ద్వారా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం భూములు తిరిగి తెలంగాణలో కలపడం వలన ఆలయ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా పట్టణంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కబ్జాకు గురయ్యాయని, హైడ్రాబాద్ తరహాలోనే భద్రాచలంలో కూడా హైడ్రాను పటిష్టంగా అమలు చేసి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్నాధపురం నుంచి భద్రాచలం వరకు సింగిల్‌రోడ్డుగా ఉన్న రహదారిని జాతీయ రహదారిగా మార్చి అంతరాష్ట్ర సరిహద్దులకు మెరుగైన రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో టీజెస్ ఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అనంతరం టీజేఎస్ భద్రాచలం నియోజకవర్గం కో.ఆర్డినేటర్‌లుగా పూనెం ప్రదీప్‌కుమార్, ఆర్.రామారావులను నియమించి టీజేఎస్ సభ్యత్వ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవదానం, ఖమ్మం నియోజకవర్గం ఇంచార్జ్ బెల్లంకొండ నాగేశ్వరరావు ,పినపాక నియోజకవర్గం ఇంచార్జ్ మూల నాగిరెడ్డి, టీజేఎస్ రాష్ట్ర నాయకుడు నబి సాహెబ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ సమావేశాలను జయప్రదం చేయండి

భద్రాచలం, (ప్రభాతవార్త) :



ఈ నెల 28,29,30 తేదీలలో ఐఎఫ్‌డబ్ల్యూజే జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధుర (బృందావన్)లో జరిగే జాతీయ సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో జరిగిన యూనియన్ సమావేశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఐఎఫ్‌డబ్ల్యూజే జర్నలిస్టు యూనియన్ అనుబంధ సంఘంగా కొనసాగుతున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జాతీయ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు అధిక సంఖ్యలో జాతీయ మహాసభలకు హాజరు కావాలని అన్నారు. జాతీయ మహాసభలలో నేషనల్ కన్ఫాడరేషన్ ఆఫ్ న్యూస్ పేపర్, న్యూస్ ఏజెన్సీస్, ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం కూడా జరుగుతుందని అన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సమావేశాలలో చర్చించడం జరుగుతుందని అన్నారు. కావున జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## జర్నలిస్టులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**-ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్**

భద్రాచలం, (ప్రభాతవార్త) :




జర్నలిజం పట్ల ఆసక్తితో పాత్రికేయ వృత్తిలోకి వచ్చిన ప్రతి జర్నలిస్టు వృత్తి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ భద్రాద్రికొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 26,27 తేదీలలో భద్రాచలం పట్టణంలో నిర్వహించే పాత్రికేయుల వృత్తి శిక్షణ తరగతుల కరపత్రాలను మంగళవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. జర్నలిజం బాధ్యతాయుతం అయిందని అన్నారు. జర్నలిస్టు రాసే ప్రతి వార్త సమాజానికి అద్దం పట్టేలా ఉండాలని, మానవీయ కోణమైన వార్తలు, పరిశోధనాత్మక వార్తలతోనే జర్నలిజం విలువలు పెంపొందుతున్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ యూనియన్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు డీ.రవికుమార్, జిల్లా నాయకులు పుష్పగిరి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

భద్రాచలంటౌన్, (ప్రభాతవార్త) :



భద్రాచలంకు చెందిన జయమ్మ అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది వాటికి సంబంధించిన బిల్లులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.48వేలు మంజూరు అయ్యాయి. దీంతో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు చేతులమీదుగా చెక్కును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బొంబోతుల రాజీవ్, నర్రా రాము, బోగాల శ్రీనివాస్‌రెడ్డి, పుల్లగిరి నాగేంద్ర, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించండి

**-ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావుకు వినతి**

భద్రాచలంక్రైం, (ప్రభాతవార్త) :



భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావును ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రాక్టికల్ బిల్డింగ్, ల్యాబ్ అండ్ ఎక్యూమెంట్స్, గ్రంథాలయం బుక్స్ గురించి ఆ వినతిపత్రంలో పేర్కొనగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డా.తెల్లం వెంటనే జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్‌ను చరవాణి ద్వారా సంప్రదించి మంజూరు చేయాలని కోరారు. అనంతరం కళాశాల సిబ్బంది ఎమ్మెల్యే డా.తెల్లంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, నర్రా రాము, పుల్లగిరి నాగేంద్ర, కళాశాల సిబ్బంది, ఇంటర్ జిల్లా నోడల్ వెంకటేశ్వరరావు, ఇంచార్జ్ ప్రిన్సిపల్ డీ.సుధాకర్‌రెడ్డి, లైబ్రేరియన్ కే.గరుడాచలం, సీనియర్ అసిస్టెంట్ బీ.రత్న, ల్యాబ్ అసిస్టెంట్ చిన్నవెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## 19వ సారి రక్తదానం చేసిన నాయక్

బూర్గంపహాడ్, (ప్రభాతవార్త) : కొత్తగూడెం సింగరేణి వైద్యశాలలో బూర్గంపహాడ్ మండల పరిధిలోని టేకులచెరువు గ్రామానికి చెందిన ధనలక్ష్మి అనే క్యాన్సర్ పేషెంట్‌కు ఓ పాజిటివ్ బ్లడ్ అత్యవసరంగా కావాలని కోరడంతో స్థానికుడు వినోద్ ఓ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. కాగా ఇప్పటి వరకు ఆయన 18 మందికి రక్తదానం చేసి 19వ సారి క్యాన్సర్ రోగికి రక్తం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. తక్షణమే స్పందించి సకాలంలో రోగికి రక్తం అందించడంతో బంధువులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడని పలువురు కొనియాడుతూ అభినందించారు.

## ముగిసిన జోనల్ గేమ్స్



బూర్గంపహాడ్, (ప్రభాతవార్త) : భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచ జోనల్ గేమ్స్ దిగ్విజయంగా కన్వీనర్ రవిలాదేవి ఆధ్వర్యంలో ముగిసాయి. ఈ నెల 19వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఈ గేమ్స్‌లో పాల్వంచ జోనల్ స్థాయిలో పాల్గొన్న 3 మండలాల పరిధిలో క్రీడా ప్రతిభ కనపరిచిన వారికి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. గెలుపొందిన క్రీడాకారులకు తహసిల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డిలు బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... ఈ నాటి కొందరు విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు ప్రాధాన్యత ఇస్తూ మానసిక ఉల్లాసాన్ని కలిగించే ఆటలను మరుస్తున్నారని, మరికొందరు విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని,, ఆ మార్గాన విద్యార్థులు ప్రయాణం చేయవద్దని, ఆటల్లో, చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో గేమ్ ఆర్గనైజింగ్ సెక్రటరి విద్యాసాగర్, కొత్తగూడెం పీడీ వేణుగోపాల్, ఉపాధ్యాయులు సంగమేశ్వరరావుతో పాటు మండలంలోని పలువురు పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జ్యుడిషియల్ కోర్టు నందు స్వచ్ఛభారత్ కార్యక్రమం

**-పాల్గొన్న న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు**

భద్రాచలం, (ప్రభాతవార్త) :



జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కొత్తగూడెం ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణంలోని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ భద్రాచలం అధ్యక్షుడు టీ.చైతన్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని తలపెట్టగా న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, కోర్టు కానిస్టేబుళ్ళు, కోర్టు సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ హోం శాఖ మంత్రిని కలిసిన వల్లూరిపల్లి, బిక్కసాని

బూర్గంపహాడ్, (ప్రభాతవార్త) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను తాళ్ళూరి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపహాడ్ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పాయకరావుపేటలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. తూము రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంస్థ సాధించిన నికర లాభాల్లో 33 శాతం వాటా ఇవ్వాలి

రుద్రంపూర్, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ ఆధ్వర్యంలో సంస్థ సాధించిన నికర లాభాలు రూ.4701 కోట్లపై ప్రకటించిన 33 శాతం వాటా ఇవ్వాలని, సింగరేణిపై రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ జోక్యం తగ్గించాలని డిమాండ్ చేస్తూ గనులు, డిపార్ట్‌మెంట్‌లలో కార్మికులకు నల్లబ్యాడ్జీలు ధరింపజేసి నిరసన తెలిపారు. రూ.4701 కోట్లు నికర లాబం ప్రకటించి ప్రభుత్వం రూ.2289 కోట్లు సంస్థ డెవలప్‌మెంట్ కోసం అని చెప్పి పక్కన పెట్టడం, రూ.2412 కోట్లలో 33 శాతం ఇస్తామనడం ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనం అన్నారు. రూ.4701 కోట్లలో 33 శాతం కార్మికులకు పంచగా మిగిలిన 67 శాతం డెవలప్‌మెంట్ కోసం వాడాలని గతంలో ఎప్పుడూ లేనిది కొత్త వరవడితో కొంత అమౌంట్ పక్కన పెట్టడం ద్వంద వైఖరితో కొంత అమౌంట్ తీసి పంచడం అనేది కార్మికుల కష్టార్జితాన్ని దోచుకోవడమే అని అన్నారు. రాజకీయ జోక్యం వల్ల సంస్థ మనుగడకు, కార్మికులకు ఇబ్బంది కలుగుతుందని, రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని వెంటనే ప్రకటించిన మొత్తం లాభాల్లో నుంచి 33 శాతం కార్మికులకు వెంటనే డేట్ పక్కన చేసి కార్మికఉల అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మ శ్రీనివాస్, రాసూరి శంకర్, విజయ్, వెంకటేశ్వర్లు, సూరజ్, రాజ్‌కుమార్, గణేష్, రాజేందర్, వెంకట్రావ్, పూర్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ట్రైనీ మైనింగ్ పోస్టుల భర్తీపై విచారణ చేయాలి

**- సీఎండీని కలిసిన కోటా శివశంకర్**

కొత్తగూడెం, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



సింగరేణి సంస్థలో మార్చి నెలలో ట్రైనీ మైనింగ్ గ్రాడ్యుయేట్ పోస్టులకు సింగరేణి యాజమాన్యం పరీక్ష నిర్వహించిన కంపెనీకి అంతర్గత లావాదేవీలు లాలూచీలు పడి ఒక్కొక్క పోస్టును 30 లక్షలకు అమ్ముకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, దీనిపైవిచారణ జరిపించాలని తెలంగాణ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. ఈ మేరకు సీఎండీని కలిసి వినతి పత్రాన్ని అందించారు. పరీక్షల ముందే అభ్యర్థులకు పేపర్ అమ్మినట్లు తెలుస్తోందని, కీ పేపర్‌లో ఏమైనా అబ్యంతరాలు ఉంటే తెలియజేయాలని చెప్పి అభ్యంతరాలు స్వీకరించకుండానే ఫైనల్ జాబితా విడుదల చేయాలని, అధికారుల కుమారులకు మార్కులు కలిపి మొత్తంగా వారికే ఉద్యోగాలు వచ్చే విధంగా అంతర్గత ఒప్పందాలు జరిగాయని, నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరిగిందని, వీటన్నింటిపై విచారణ జరిపించి ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ముగిసిన స్కూల్ జోనల్ గేమ్స్

**- విజేతలకు బహుమతులు అందజేసిన ఏరియా జీఎం శాలెంరాజు**

రుద్రంపూర్, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా పోటీలు చాలా ప్రశాంత వాతావరణంతో జరిగాయి. హెచ్ఎం బాలాజీ, పీడీ కవిత, తోటి సహోపాధ్యాయులతో పాటు ఐదు మండలాలకు పీడీల సలహా, సహకారంతో దిగ్విజయంగా ముగించారని ప్రశంసించారు. గేమ్స్, అథ్లెటిక్స్‌లో గెలుపొందిన వారికి మెమోంటోలను, ప్రశంసా పత్రాలను ఇచ్చారు. ఈ రెండు రోజులు నిర్వహించిన పోటీలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 1500, 800, 400, 200, 100 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, డిస్కస్ త్రో, సీనియర్స్, జూనియర్ బాలుర, బాలికల విభాగంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం శాలెంరాజు, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్‌లు పాల్గొని క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. అదే విధంగా మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మీ క్రీడాపోటీలను సందర్శించి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడెల్లి యాకయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీ, రాధ, వెంకటేశ్వర్లు, రజియా, చంద్రకళ, గణేష్, కృష్ణవేణి, చారి, సిబ్బంది ధీరజ్‌లు పాల్గొన్నారు.

# రామచంద్ర కాలేజీలో ఎన్ఎస్ఎస్ డే

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:

స్తానిక రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వనజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్వంచ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మ, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ డే ప్రాముఖ్యతను వివరించారు. నిస్వార్థమే లక్ష్యంగా సేవ చేసే యూనీఫాం లేని సైనికులే ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సునీత, అనురాధ, పూర్ణచందర్‌రావు, విద్యా ప్రవీణ పాల్గొన్నారు.

# ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండురోజుల శిక్షణ

**- జిల్లా వాసికి ఉత్తమ సత్కారం**

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫౌండర్ గురూజీ మాస్టర్ మోటివేటర్ గంప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటికో స్పీకర్, ఊరికో ట్రైనర్ అనేది ఇంపాక్ట్ నినాదంతో హైదరాబాద్‌లోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో రెండు రోజులుగా చాలా ఘనంగా జరిగింది. నవభారత్ నిర్మాణానికి రాలెత్తే కూలీలం మేము అనే నినాదంతో ఎంతో మందికి నైపుణ్య దానాన్ని పంచి ఇంపాక్ట్ ద్వారా ట్రైనర్‌నసగా తీర్చిదిద్దడం జరుగుతుంది. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం అనేది 40 రోజులుగా జూమ్ మీటింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉంటుంది. రెండు రోజులుగా హైదరాబాద్‌లో ఒక స్టార్ హోటల్‌లో ఆఫ్ లైన్‌లో కండక్ట్ చేశారు. టీటీటీడబ్ల్యూఎస్ 170 బ్యాచ్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో 60 మందిలో అందరికంటే బాగా పెర్ఫార్మెన్స్ చేసినందుకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును జిల్లాలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బానోత్ రాంబాబుకు అందించారు. మాస్టర్ మోటివేటర్ గంప, స్ఫూర్తి ఫౌండర్ శ్యాం రాథోడ్, ప్రవీణ్, విశ్వశ్రీ, మెంటర్స్ రమేష్‌ల చేతుల మీదుగా సర్టిపికెట్‌ను అందుకున్నారు. ఈ అవార్డును అందుకోవడం తనకు చాలా సంతోషంగా ఉందని రాంబాబు తెలిపారు.

# వివేకవర్ధనిలో కంటి నిర్ధారణ పరీక్షలు

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



స్థానిక వివేకవర్ధని డిగ్రీ, పీజీ కాలేజీలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా నవభారత్ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఎన్ఎస్ఎస్ వివేకవర్ధని ఆధ్వర్యంలో ఉచిత కంటి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సీఈవో చైతన్య కృష్ణ పాల్గొని మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు సెల్ఫోన్ వాడకం ఎక్కువ కావడంతో కంటి చూపు సమస్యలు వస్తున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఎన్ఎస్ఎస్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. విద్యార్థులకు, స్థానికులకు సుమారు 350 మందికి కంటి పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాంబాబు, ప్రిన్సిపాల్ సతీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేష్, డీన్ సాయికృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది, నవభారత్ కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.




# పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కొల్లు పద్మ

కొత్తగూడెం, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని, తూము చౌదరిల ఆధ్వర్యంలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షురాలు, శ్రీనగర్‌కాలనీ మాజీ సీనియర్ ఎంపీటీసీ కొల్లు పద్మ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు మంత్రి పొంగులేటి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రావి రాంబాబు, కూచిపూడి జగన్, పూనెం శ్రీను, భద్రమ్మ, మాజీ సర్పంచ్ మహేష్, ఐకే రాజు, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

# వినోభానగర్‌లో హెల్త్ క్యాంపు

జూలూరుపాడు, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



మండలంలోని వినోభానగర్ గ్రామంలో మంగళవారం జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారిని వైద్యం చేయడం జరిగింది. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల్ని పరీక్షించడం జరిగింది. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్తపూతలను సేకరించారు. వైరల్ ఫీవర్ రావడం వల్ల దీర్ఘకాలిక ఒళ్లు నొపునపలతో బాధపడటం జరుగుతుందని, వారిని సందర్శించి పలు సూచనలు చేశారు. ఎటువంటి ఆహార నియమాలు పాటించాలో వివరించారు. డ్రైడే యాక్టివిటీస్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి

**- జూలూరుపాడు ఎస్సై రాణా ప్రతాప్**

జూలూరుపాడు, సెప్టెంబర్ 24 – ప్రభాతవార్త:



రాజీపడదగిన కేసులు ఉన్న వారు రాజీమార్గం ద్వారానే పరిష్కరించుకోవడమే మంచిది. దీని ద్వారా సమయం వృదా కాదని, కక్షలు, కారుణ్యాలు తగ్గుతాయని, తద్వారా స్నేహభావం పెంపొందుతుందని, మీ ఉచిత న్యాయ సేవ అధికార సంస్థ ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు కొత్తగూడెం జిల్లా కోర్టులో మెగా లోక్ అదాలత్ ఉందని జూలూరుపాడు ఎస్సై రాణా ప్రతాప్ తలెఇపారు. జూలూరుపాడు పీఎస్ పరిధిలోని మీపై కానీ, మీకు తెలిసిన వారిపై కానీ, మీ బందువులపై కానీ ఏమైనా కేసులు ఉంటే వాటిని పరిష్కారం చేసుకొని కోర్టుకు హాజరైతే ఆ కేసులను పూర్తిగా మూసివేయడం జరుగుతుందని అన్నారు. పూర్తి సమాచారం కోసం ఎస్సై 8712682041, కోర్టు కానిస్టేబుల్ 9704694238, 9959124768 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

# నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా





– ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**చంద్రుగొండ, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:** జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. చంద్రుగొండలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను మొదటి ప్రాధాన్యత విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేస్తానని అన్నారు. ఈజీఎస్ ద్వారా చంద్రుగొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.47.50 లక్షలతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఆశ్రమ పాఠశాలలో డ్రైనేజీ పనులకు రూ.18 లక్షలు, పీహెచ్‌సీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, బీసీ బాలికల వసతి గృహానికి రహదారి నిర్మాణానికి రూ.7 లక్షలు, విద్యుత్ సబ్ స్టేషన్‌కు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.7.50 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. మహిళాశక్తి పథకం కింద 8 గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ.లక్ష చొప్పున రూ.8 లక్షల చెక్కులను డ్వాక్రా మహిళలకు అందజేశారు. చంద్రుగొండ పీహెచ్‌సీలో రోగులకు పడకలు సరిపోవడం లేదని, మరో పది పడకలకు గదులను ఏర్పాటు చేయాలని వైద్యులు కోరగా పడకల ఏర్పాటుకు భవనం మంజూరి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని అన్నారు. పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన కోరారు. మంజూరైన నిధులకు పనులు వేగవంతం అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేశానని ఆయన అన్నారు. తన హయాంలో చేస్తున్న అభివృద్ధి పనులను ఆయా గ్రామాల్లో ప్రజలు తిలకించేలా డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేస్తున్న పనులు, చేయాల్సిన పనులు డిజిటల్ బోర్డుల్లో కనిపించేలా ప్రజలకు జరిగే అభివృద్ధిపై అవగాహన ఉంటుందన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బయ్యారపు అశోక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత, పీహెచ్‌సీ వైద్యాధికారి తనూజ, వెంకట ప్రకాష్, ఐకేపీ ఏపీఎం సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యా నాయక్, రమణ, ఏడుకొండలు, బోగినబోయిన కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

## విద్యార్థి మానసకు కృత్రిమ కాలు ఏర్పాటు






**ములకలపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మారుమూల గ్రామమైన పాత గుండాలపాడుకు చెందిన నిరుపేద ఆదివాసీ కుటుంబానికి చెందిన కారం మానస చిన్నప్పటి నుండి ఎంతో చలాకీగా ఉండి చదువులో ముందుండేది. 8వ తరగతిలో ఉండగానే అంతుచిక్కని వ్యాధితో కాలు సెప్టిక్ కాగా ఇంటర్ చదువుతున్న 2022 సమయంలో కాలు తీసివేయవల్సి వచ్చింది. ఈలోగా ఇంజనీరింగ్ సీట్ సాధించినప్పటికి ఆర్థిక ఇబ్బందులకు తోడు వైకల్యం తోడవడంతో చదువు మానేసి ఇంటివద్దనే ఉంటుండగా గత ఏడాది గ్రామంలో రగ్గులు అందించేందుకు పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వచ్చిన ములకలపల్లి గ్రామ వాసి పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పుష్పాల రామారావు విద్యార్థిని గమనించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆమెను ఇంజనీరింగ్ చదివేలా తల్లిదండ్రులను ఒప్పించి మరొకవైపు ఆమెకు కృత్రిమ కాలు నాణ్యమైనది ఏర్పాటు చేయడం కోసం తనకు పరిచయం ఉన్న స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి పినపాకకు చెందిన సామాజిక కార్యకర్త తోలెం శ్రీనివాస్ సహకారంతో విజయవాడకు చెందిన శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో హైదరాబాద్‌లోని ఎవెల్యూషన్ ప్రొస్తెటిక్ లింబ్స్ సంస్థ ప్రతినిధి జన్ను నాగరాజు సహకారంతో ఆమెకు విదేశాల నుండి దిగుమతి చేసుకున్న సుమారు 1లక్ష వ్యయంతో ఆధునాతనమైన కృత్రిక కాలును హైదరాబాద్‌లో సోమవారం అమర్చడం జరిగింది. దీంతో ఆమె ప్రస్తుతం సాధారణంగా నడుస్తూ ఇంజనీరింగ్ చదువుతుంది. తన కుటుంభం యొక్క స్థితి గతులను గమనించి తనకు కృత్రిమ కాలును అందించేందుకు కృషి చేసిన ఖమ్మం రూరల్ ఎస్ఐ పుష్పాల రామారావుకు, దాతలకు ఈ సందర్భంగా కారం మానస మరియు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కేబుల్‌రెడ్డి హీరో సుహాస్‌ని కలిసిన చైర్‌పర్సన్

**చుంచుపల్లి, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**



మండలంలోని రుద్రంపూర్ పంచాయతీలో గత వారం రోజులుగా కేబుల్‌రెడ్డినడ మూవీ షూటింగ్ నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని మూవీ టీం లంచ్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె హీరో సుహాస్‌ని కలిసి బొకే అందజేశారు. శాలువ కప్పి సన్మానించారు. ఇంకా మరిన్ని సినిమాల్లో నటించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆశీర్వదించారు. కేబుల్ నెట్‌వర్క్ ఓనర్ పడే కష్టాలు ఎలా ఉంటాయో తెలియజేస్తూ సినిమా ఉంటుందని, అందరూ కటుంబ సమేతంగా ఆదరించాల్సిన చిత్రం అని డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి చెప్పారు.

## త్రివేణి విద్యార్థులే కరాటే పోటీల్లో మేటి

**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**



స్థానిక లక్ష్మీదేవిపల్లిలో ఉన్న త్రివేణి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఈ నెల 22న జరిగిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం యూసఫ్‌గూడ హైదరాబాద్ వేదికగా ఫస్ట్ నేషనల్ కరాటే కుంగ్‌ఫూ అండ్ టైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024లో సీనియర్ విభాగంలో లక్షితా కరాటే కుమితే విభాగంలో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ప్రవస్తి కరాటే కటా విభాగంలో అత్యుత్తమ ప్రతిభను కనపర్చి మరో స్వర్ణపతకాన్ని సాధించారు. విజేతలను డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, సీఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ సింగ్, వైవీ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య, ఫాతిమాలు అభినందించారు.




## టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన కొత్వాల

**పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**



హైదరాబాద్ గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్‌ను కొత్తగూడెం నియోజకవర్గం పాల్వంచకు చెందిన కాంగ్రెస్ నాయకులు, డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం కొత్వాలతో పాటు 50 మంది ముఖ్య నాయకులు పాల్వంచనుంచి 12 కార్లలో హైదరాబాద్‌కు వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టత గురించి చర్చించారు. కార్యకర్తలు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. పాల్వంచనుంచి వెళ్లిన వారిలో బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, కాల్వ భాస్కర్, కాపర్తి వెంకటాచారి, వై.వెంకటేశ్వర్లు, మెలిగ మహేష్, కాపా శ్రీను, శ్రీలతా రెడ్డి, గంధం నరసింహారావు, పాబోలు నాగేశ్వర రావు, వాసం మంగయ్య, బుడగం కిరణ్, కోలేటి రాంబాబు, అజ్మీరా రమేష్, బానోత్ బాలాజీ, కామాచారి, శెట్టిపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన మంచినీటిని అందించాలి

– జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి



**పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:** గ్రామాల్లో స్వచ్ఛమైన మంచినీటిని అందించడం ద్వారా అతిసారా, కలరా, టైఫాయిడ్ లాంటి వ్యాధులు నివారించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సూచించారు. మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు తోగ్గూడెం గ్రిడ్‌లో రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రిడ్ ఈఈ నళిని మాట్లాడుతూ... మంచినీటి క్వాలిటీ చెక్ చేయడం, హ్యాండ్ పంప్ రిపేరు, క్లోరినేషన్‌పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. డీఈ సాయి, ఎంపీవో నారాయణ, ఏఈ నీలావతి పాల్గొన్నారు.

## విద్యుదాఘతానికి గురై ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు గాయాలు



**చంద్రుగొండ, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:** మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేసేందుకు వెళ్లిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ వెంకటేశ్వర్లు విద్యుదాఘతానికి గురై గాయాల పాలయ్యాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... చంద్రుగొండలో డ్రైనేజీ పనులు జరుగుతుండగా విద్యుత్ వైర్లు అడ్డువచ్చాయి. వాటిని తొలగించేందుకు వెంకటేశ్వర్లు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రయత్నం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చేతికి, పొట్టపై స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు.

# తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా బిజేపీ

- మోడీ పాలనతో విశ్వ గురువుగా భారత్
- విజయవంతంగా నడుస్తున్న బిజేపి సభ్యత్వ నమోదు కార్యక్రమం
- మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు కొండపల్లి

*మధిర సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :*

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా భారతీయ జనతా పార్టీ ఎదిగిందని బిజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారు స్థానిక నాయకులు ముఖ్య కార్యకర్తలు కలిసి నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశంలో మూడవసారి ప్రజలు భారతీయ జనతాపార్టీకి మోడీ నాయకత్వానికి పట్టం కట్టారని అన్నారు. గడిచిన కాలంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు ప్రపంచ దేశాలకు విశ్వ గురువుగా దేశాన్ని నిలిపిన ఘనత నరేంద్రమోడీ దే అన్నారు. దేశంలో బిజేపీ పార్టీకి ప్రజల్లో విశ్వాసం ఆదరణ పెరిగిందని ఇందుకు దేశవ్యాప్తంగా నమోదైన 10 కోట్ల సభ్యత్వాలు నిదర్శనమని వారు అన్నారు. ఇదే వరంపర రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా మారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి



విశేష స్పందన లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జ్ ఎడ్ల అశోక్‌రెడ్డి, తిరుమలపల్లి విజయరాజు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్రంలో బిజేపి ప్రాథమిక సభ్యత్వం రికార్డ్ స్థాయిలో నమోదవుతున్నదని అన్ని జిల్లాలలో మునుపెన్నడూ లేనివిధంగా సభ్యత్వం స్వచ్ఛందంగా తీసుకుంటున్నారని బిజేపీ తెలంగాణ సభ్యత్వ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. బిజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మధిర పట్టణంలో పర్యటించిన ఆయన మధిర మెయిన్‌రోడ్డులోని పలు వర్తక సముదాయ షాపుల నుండి సభ్యత్వాలను సేకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సభ్యత్వంలో ప్రత్యేక రికార్డు నెలకొల్పనున్నదని ప్రపంచంలోనే గతంలో అతి ఎక్కువ సభ్యులు ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని అధిగమించి 10 కోట్లకు పైగా సభ్యత్వం కలిగి ఉన్న బిజేపీ ప్రస్తుతం ప్రపంచంలోనే అతి ఎక్కువ సభ్యులు ఉన్న రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని దీనికి కారణం నరేంద్ర మోడీ సుపరిపాలనని తెలంగాణలో కూడా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతున్న భారతీయ జనతాపార్టీ సభ్యత్వంలో ఖమ్మం జిల్లాలో సైతం గతంలో లేని విధంగా రికార్డ్ స్థాయిలో సభ్యత్వం నమోదు కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య జిల్లా నాయకులు మధిర పట్టణంలో వారి పర్యటనలో వారిని కలిసి శాలువాతో సత్కరించారు. ఈ పర్యటనలో బిజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి బిజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, బిజేపీ ఖమ్మం జిల్లా సభ్యత్వ ఇంచార్జ్ ఎడ్ల అశోక్‌రెడ్డి, బిజేపీ మధిర అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థి విజయరాజు, బిజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, బిజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, బిజేపీ మధిర పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, మర్సకట్ల మర్సకట్ల స్వర్ణాకర్, శ్రీహరి, మీనుగు శంకర్‌మోహన్‌రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పిఆర్‌టియు బోనకల్ మండలాధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

*బోనకల్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త*

పిఆర్‌టియు బోనకల్ మండల శాఖ ఆధ్వర్యంలో చిరునోముల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండలాధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కొనకంచి రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మద్దినేని వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులుగా ఎస్.దుర్గాప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్‌వి.రవికిరణ్, ఉపాధ్యక్షులుగా బి.కొండలరావు, మహిళా ఉపాధ్యక్షురాలిగా జి.రూప్సీ, మహిళా కార్యదర్శులుగా సిహెచ్ మంగతాయారు. కె.బేబి, కార్యదర్శిగా నర్సింహారావు, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్.వెంకటేశ్వర్లు, సిహెచ్.కోటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## తాగునీటి క్వాలిటీ అవగాహనపై శిక్షణ

*బోనకల్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త*

కలెక్టర్ ఆదేశాల ప్రకారం మిషన్ భగీరథ శాఖ వారు ఈనెల 23 నుంచి 26 వరకు ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు, సిబ్బందికి తాగునీటి క్వాలిటీపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. పైప్‌లైన్లు మరమ్మతులు ఎలా చేయాలి, చేతిపంపు రిపేరు ఎలా చేయాలి, గ్రామ పంచాయతీ మంచినీటి బోర్లు, మోటార్లపై శిక్షణ కల్పించారు. మంచినీటి ల్యాబ్ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు, అనుభవజ్ఞులైన ట్రైనర్ల ద్వారా ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శాస్త్రి, మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎస్‌ఈ సదాశివ కుమార్, ఎమ్మార్వో పున్నం చందర్, డిఇఇ శ్రీనివాస్, ఎఈ చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ రేషనలైజేషన్ మార్గదర్శకాల్లో మార్పు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐ, పెన్షన్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలి
- పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుల యలమద్ది వెంకటేశ్వర్లు

*బోనకల్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త*

ఉపాధ్యాయ రేషనలైజేషన్ మార్గదర్శకాల్లో మార్పు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐ, పెన్షన్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. పిఆర్‌టియు మండల శాఖ సర్వసభ్య సమావేశం చిరునోముల ఉన్నత పాఠశాల ఆవరణలో మండల శాఖ అధ్యక్షులు కె.రామ్మోహన్‌రావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో పాఠశాల విద్యాసంచాలకులు ఈనెల 20న జిల్లా



కలెక్టర్లకు విడుదల చేసిన ఉపాధ్యాయ రేషనలైజేషన్ మార్గదర్శకాలు ప్రాథమిక విద్యకు తూట్లు పొడిచేలా ఉన్నాయని, తక్షణమే మార్గదర్శకాల్లో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. జిఓ 25 ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 90 మందికి ముగ్గురు ఉపాధ్యాయులు, 220 మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయ పోస్టులు ఉండేలా ఉపాధ్యాయ సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు. వర్కు ఎడ్జెస్ట్‌మెంట్ పేరుతో ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేయవద్దని, ఖాళీ పోస్టుల్లో వెంటనే డిఎస్‌సి నియామకాలు చేపట్టాలన్నారు. ఎక్కడన్నా విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండి ఉపాధ్యాయులు సంఖ్య మరీ ఎక్కువ ఉంటే సర్దుబాటు చేయడాన్ని పిఆర్‌టియు వ్యతిరేకించడం లేదని, అదే క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేలా నాణ్యమైన విద్య అందేలా విద్యాశాఖ చర్యలు ఉండాలన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న జిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐ డబ్బులు నెలలు గడుస్తున్నా విడుదల చేయకపోవడం చివరికి ఉద్యోగ విరమణ చేసిన ఆరు నెలలకు కూడా పెన్షన్ బిల్లులు మంజూరీ కాకపోవడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న సంఘ కార్యకలాపాల నివేదికను ప్రవేశ పెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, జిల్లా బాధ్యులు జి.సుజాత, సిహెచ్.రవికుమార్, కొమ్ము శ్రీనివాసరావు, టి.రత్నకుమార్, మండల నోడల్ అధికారి దామాల పుల్లయ్య, మహిళా నాయకులు జి.రూప్సీ, ఎం.భాగ్యలక్ష్మి, జి.నాగలక్ష్మి, సిహెచ్.కోటేశ్వరరావు, గుత్తా శ్రీను, రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.




## నిరంతరం శ్రమతోనే విజయ లక్ష్యం సాధ్యం

- జెఎన్‌టియు రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు

*మధిర సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :*



నిరంతర పాఠన విషయపరిజ్ఞానంపై పట్టుదలతోనే విద్యార్థులు విజయం సాధించగలుగుతారని జెఎన్‌టియు రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు విద్యార్థులకు సందేశం ఇచ్చారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హెచ్ఎం తోట నరసింహారావు అధ్యక్షతవహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం శ్రమిస్తే విజయం తప్పక మనదవుతుందని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలకు పాటిస్తూ క్రమశిక్షణతో ఎదిగి మంచి పౌరులుగా ఉండాలని కోరారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని ఎన్ని ఆటంకాలొచ్చినా, లక్ష్యాత్మకంగా నిబద్ధతతో కృషి చేసి విజయం సాధించాలని అన్నారు. గురువుల పట్ల విధేయతతో వారి సూచనలను అనుసరిస్తూ ఎదగాలని ఆకాంక్షించారు. ఈన క్లాస్‌మేట్ స్నేహితుడైన పాఠశాల ఉపాధ్యాయుడు బి.జ్ఞానేశ్వరాచారిని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉదన్నారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.జ్ఞానేశ్వరాచారి, బూసా కోటేశ్వరరావు, కె.ఆదాము, పి.కిషోర్, టి.జ్యోతిర్మయి, బివి.యన్.యం.శర్మ, ఎ. కృష్ణమూర్తి, జి. రామచంద్రరావు, యస్. సంధ్యాలక్ష్మి, యస్.శ్రీదేవి, యం. సాములు, యం.మాధవరావు, సిహెచ్. చిట్టిబాబు, సూర్యప్రకాష్‌రావు, టి.సీత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

*మధిరరూరల్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:*



ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం మధిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.జయదాస్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వం యువజన క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇంటర్మీడియేట్ స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు గల విద్యార్థులను వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకునే విధంగా ఏర్పాటుచేసిన విభాగమే జాతీయ సేవ పథకం(ఎన్ఎస్ఎస్) అని పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టాలని, దేశానికి, రాష్ట్రానికి ఇంకా ఎన్నో సేవలు చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో బి.తౌరియా, లైబ్రేరియన్ కొమ్ము గురవయ్య, యు.కృష్ణ, పి.కమల, జి.కృష్ణ, వి.శోభరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ముమ్మరంగా ఇందిరా డైరీ సర్వే

*మధిరరూరల్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:*

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రతిష్టాత్మకంగా మధిర నియోజకవర్గంలో చేపట్టిన ఇందిరా డైరీ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గుడికందుల జ్యోతి ఆదేశాలతో మండల వ్యాప్తంగా అధికారులు గత రెండురోజులుగా బీసీ లబ్ధిదారుల ఎంపికపై సర్వే నిర్వహిస్తున్నారు. పాడి పశువుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేసి ఎంపిక చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మధిర బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి వీలప్రోలు శ్రీనివాసరావు, గ్రామదీపిక దురిశాల కల్యాణి పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై ఎందుకింత నిర్లక్ష్యం

**-యథేచ్ఛగా రహదారులపై వేస్తున్న వైన్యం**

**-పాలకులు, అధికారులు విన్నవిస్తున్నా ప్రజలకు పట్టింపులేదా..!**





**ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:**
ఇల్లెందు పురపాలకంలో ఓ వైపు అధికారులు, పాలకులు స్వచ్ఛ ఇల్లెందుకోసం శ్రమిస్తుంటే..కొంత మంది ప్రజలు మాత్రం అదేమి మాకు అవసరం లేదన్నట్టుగా చెత్తంగా రహదారులపై విసిరేస్తున్నారు..పట్టణంలోని పలువార్డుల్లో తడి పొడి చెత్తను సేకరించే పుర వాహనాలు వస్తున్నప్పటికీ వాటిలో వేయకుండా ఇష్టానుసారంగా రహదారులపక్కనే వేస్తూ స్వచ్ఛ ఇల్లెందుకు తిలోదకాలిస్తున్నారు..స్వచ్ఛతపై పాలకులు పుర సిబ్బందికి సహకరించాలని తడిపొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని పదే పదే విన్నవిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తడి,పొడి చెత్తను ఏకంగా రహదారులపై పక్కన వేస్తుండటంతో చెత్తంగా వర్షాలకు కల్లి దుర్గంధం వెదజల్లడంతో పాటుగా ఆ చెత్తలో దోమలు వీరవిహారం చేస్తుండటంతోపాటు కుక్కలకు ఆవాసాలుగా మారి ఆ చెత్తనంతా రహదారులపైకీ ఈడ్చుకొస్తూ పాదచారులకు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులను కలుగచేస్తున్నాయి. పట్టణంలోని కబరిస్తాన్ వెనుకబాగంలో 9వ వార్డుకు వెల్లే దారిలో రహదారిపక్కనే చెత్తను వేయడంతో చిన్నపాటి డంప్‌యార్డుగా తయారైంది. అంతే కాకుండా 5వ వార్డులో థప్స్ అప్ గోదాం నుంచి ఆర్‌సీఎం చర్చికి వెళ్లేదారిలో రహదారి పక్కనే ఏకంగా మురుగుకాలువలో చెత్తను వేస్తుండటంతో చెత్తకుండీలను తలపిస్తున్నాయి. పట్టణంలో పిన్‌పాయింట్లు లేకుండా ఉండేందుకు ఒక వైపు మున్సిపల్ ఛైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు అహర్నిశలు శ్రమిస్తుంటే కొంత మంది ప్రజలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఇష్టానుసారంగా చెత్తను కుల్లిన పదార్ధాలను రహదారులపై వేస్తూ పారిశుధ్య పనులకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే చెప్పొచ్చు. ఈ విషయంపై ఆప్రాంత ప్రజలను కొంత మందిని విచారించగా చెత్త బండి తరచూ వస్తున్నప్పటికీ కావాలనే చెత్తను రహదారులపై వేస్తున్నారని తెలిపారు. పురపాలక అధికారులు రహధారులపై చెత్తను వేసే వారిని గుర్తించి వారిని హెచ్చరించాలని ప్రజలు కోరుతున్నారు.



## పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి**

**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**
పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతీ ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి సూచించారు., జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మనందరి సామాజిక బాధ్యత అని అన్నారు. కోర్టు ఆవరణలో ఉన్న చెత్తను న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తొలగించారు. బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, ఏపీపీలు పీవీడీ లక్ష్మి, లావణ్య, విశ్వశాంతి, నాగలక్ష్మి, ఊట్కూరు పురుషోత్తంరావు, తోట మల్లేశ్వరరావు, ఏపూరి బాబురావులు పాల్గొన్నారు.

## సత్వర న్యాయం చేకూరేలా పోలీసులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

**- లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ రోహిత్‌రాజు**

**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**



వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన పలు కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు జరగకుండా నిత్యం పెట్రోలింగ్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నేర విచారణలో జాప్యం జరగకుండా బాధితులకు సత్వర న్యాయం చేకూరేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సామాన్య ప్రజానికానికి ఇబ్బందులు కలిగే విధంగా ప్రవర్తించే ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అదే విధంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాదితులను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# టొబాకో క్యాన్సర్‌కు కారణం



**- యువత టొబాకో, దాని ఉత్పత్తులకు దూరంగా ఉండాలి**

**- టొబాకో ఫ్రీ యూత్ క్యాంపియన్ 2.0ను ప్రారంభించిన డీఎంహెచ్‌వో**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**
టొబాకో ఫ్రీ యూత్ క్యాంపియన్ 2.0 కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం సిబ్బందికి అవగాహన కల్పించి సిబ్బందితో పాటు ప్రతిజ్ఞ చేశారు. 60 రోజుల పాటు జరిగే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రాతమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు, గ్రామాల్లో ప్రజలకు పొగాకు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని, పొగాకు , దానికి సంబంధించిన ఉత్పత్తులు అయిన ఖైనీ, జర్దా, గుట్కా, సిగరెట్, బీడీలు, చుట్టలు, పాన్ మషాలా వినియోగించడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు నోరు, గొంతు, ప్రేగులు ఊపిరితిత్తులు, గుండె తదితర వాటికి వ్యాధులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని అన్నారు. అంతే కాకుండా ఆడా, మగా వ్యత్యాసం లేకుండా మరి ముఖ్యంగా యువకులు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలకు, సినిమా సన్నివేశాలకు ఆకర్షితులై అలవాట్ల బారిన పడి వారి అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రజలు పొగాకు, దాని ఉతనపత్తులకు దూరంగా ఉండి మీ విలువైన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బాలాజీ, మధు వరుణ్, స్వప్న, కల్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత పాల్గొన్నారు.

## ఉధృతంగా ముత్యాలంపాడు వాగు

**తెగిపోయిన తాత్కాలిక అప్రోచ్**

**నిలిచిన రాకపోకలు**

**ప్రజల ఇక్కట్లు**

**ములకలపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని ముత్యాలంపాడు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగు ఉధృతికికి వాగుపై నిరి ్మంచిన తాత్కాలక అప్రోచ్ తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువున కురిస భారీ వర్షానికి వాగు ఒక్కసారిగా పొంగింది. దీంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో తాత్కాలికంగా వేసిన అప్రోచ్ కొట్టుకుపయింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగు దాటేందుకు గాను ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రమాదకరంగా మారినప్పటికి కొందరు గత్యంతరం లేక వాగు దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

## 30న రోల్ ప్లే పోటీలు : డీఈవో

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**
జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 30వ తేదీన రోల్ ప్లే పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వచారీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 8, 9 తరగతులు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని, ఈ పోటీలు పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించడతాయని అన్నారు. ప్రతీ పాఠశాల నుంచి నలుగురైదుగురు విద్యార్థులు పాల్గొనాలని, వీరంతా కేవలం స్కూల్ యూనీఫాంలోనే పాల్గొనాలని, ఎటువంటి వస్తువులు, స్టేజ్‌పై ఉపయోగించరాదని, సంభాషణలు కేవలం ఇంగ్లీష్ భాషలోనే ఉండాలని సూచించారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు బహుమతులు పొందిన టీంలోని ప్రతీ విద్యార్థికి రూ.300, రూ.200, రూ.150 చొప్పన నగదు బహుమతిగా ఇవ్వబడుతుందని, మొదటి బహుమతి పొందిన టీం రాష్ట్ర స్థాయి పోటీలకు పంపబడుతుందని అన్నారు. ఈ నెల 28వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆదేశించారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**- జిల్లా న్యాయ సేవాదికార సంస్థ కార్యదర్శి భానుమతి**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 - ప్రభాతవార్త:**



జిల్లా కోర్టులో ఈ నెల 28వ తేదీన శనివారి జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ మీద కానీ, మీకు తెలిసిన వారి మీద కానీ, మీ బందువుల మీద కానీ ఏమైనా కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకోవచ్చని అన్నారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూ తగాదాలు, వివాహ బంధానికి, చిన్న చిన్న చోరీలు, ట్రాఫిక్ చలాన్లు, కుటుంబ తగాదాలు, బ్యాంకు, టెలీఫోన్ కేసులు ఇలా ఏ కేసు అయినా కానీ రాజీ మార్గం ద్వారా రద్దు చేసుకునే అవకాశం ఉందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




ఖమ్మం, కార్పొరేషన్, రఘునాధపాలెం, కల్చరల్, ఖమ్మం రూరల్

# పెసల మార్కెట్‌లో మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీ

**రైతుల ప్రయోజనాలు దెబ్బతింటే సహించేది లేదని హెచ్చరిక**

**పెసలు కొనుగోళ్లను పరిశీలించిన తుమ్మల**

**ప్రభాతవార్త కథనానికి స్పందించిన మంత్రి**



ప్రభాతవార్త ప్రత్యేక ప్రతినిధి:
రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ జోడి సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పెసలు విక్రయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ మద్దతు ధర రైతుకి సక్రమంగా అందుతుందా లేదా ఏదైనా అక్రమాలు జరుగుతున్నాయా అనే అంశాలపై ఆయన ఆరా తీశారు. "దళారుల కొమ్ముకాస్తున్న మార్కెట్"మద్దతు ధర అందకుండా ప్రైవేటు వైపు నెట్టేస్తున్నారు అనే శీర్షికతో ఈనెల 23న సోమవారం ప్రభాతవార్త ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనంలో రైతులు వద్ద పెసలు సాదాసీదాగా కొనుగోలు చేయడం లేదని అక్కడున్న అధికారులు తేమశాతం ప్రమాణాల ప్రకారంగా ఉన్నప్పటికీ ఏదో ఒక లోపం చూపి కొనుగోలు చేయకుండా తీవ్రంగా జాప్యం చేయడం రైతులతో వాగ్వాదానికి దిగడం వంటి సంఘటనలతో రైతులు విసిగిపోయి చివరకు క్వింటాకు 1000 నుంచి 1500 తక్కువ ధరకు ఆ పక్కనుండే దళారులు అమ్ముకునే దుస్థితి మార్కెట్లో ఏర్పడిందని అంశాలను ఆ కథనంలో పొందుపరచడం జరిగింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం





వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని మోడల్ మార్కెట్‌గా రాష్ట్రంలో నెలపాలని ఒక పక్క ప్రయత్నాలు చేస్తుండగా అక్కడ ఉన్న కొంతమంది అధికారులు మాత్రం ఆయన లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా రైతులను ఇబ్బందులు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రైతుల నుంచి పెద్ద ఎత్తున రావడంతో అవే అంశాలను ప్రస్తావిస్తూ కథనం ప్రచురితమైంది. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులను ఇబ్బంది పెట్టినట్టు తన దృష్టికి వస్తే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. ఇది ప్రజా రైతు ప్రభుత్వమని రైతుల మేలు కోసం మద్దతు ధరను ఖచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెసలు కొనుగోలు విషయంలో పొరపాట్లు జరిగినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు. అధికారులు అప్రమత్తతతో ఉండి రైతులకు మేలు జరిగే విధంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మార్కెట్లను ఇతర విషయాలు కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో ఆధునీకరణ పనుల విషయాలపై కూడా ఆయన అధికారులతో చర్చించారు. మంత్రి వెంట సాదు రమేష్‌రెడ్డి, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, పిఎసిఎస్ అధ్యక్షుడు వెలగొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.



## బిజేపి నేత తాండ్ర వినోద్‌రావు విస్తృత పర్యటన

**సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బిజీబిజీ**

ఖమ్మం, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:
భారతీయ జనతాపార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఖమ్మంనగరంలోని 26వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించి ప్రజలను కలిసి గత పది సంవత్సరాలుగా నరేంద్రమోడీ పనితనం చూసి దే భవిష్యత్తు కోసం అవినీతి మచ్చలేని, రాజకీయ పార్టీ అయిన బిజేపిలో చేరాలని, ప్రజలను కోరడం జరిగింది. పార్లమెంటరీ నాయకులు తాండ్ర వినోదరావు మాట్లాడుతూ ప్రజలు యువత, మహిళలు, భారతీయ జనతా పార్టీలో సభ్యత్వం స్వీకరించడానికి సిద్దంగా ఉన్నారని వారి అభిప్రాయం తెలియజేస్తూ బిజేపిలో సభ్యత్వం తీసుకోవడం జరిగింది. అదే విధంగా మోడీ పాలనలో ఒక రూపాయి అవినీతి లేకుండా ప్రజా రంజకంగా పాలన సాగుతుందని, దేశ విదేశాలలో, ఆదరణ ఉన్న నాయకుడు మన నరేంద్రమోడీ అని భారతదేశానికి ప్రధాని కావడం వల్ల దేశ విదేశాలలో భారత ఖ్యాతిని చాటుతున్న నరేంద్రమోడీ ఆదర్శవంతుడిని, ప్రపంచ దేశాలు కూడా ఆయనను కీర్తిస్తున్నాయని, ప్రపంచంలో అత్యధిక సభ్యత్వము గల పార్టీలో సభ్యులుగా చేరాలని, ప్రజలు స్వచ్ఛందంగా బిజేపిలో చేరుతున్నారని తెలియజేయడం జరిగింది. ఈ సభ్యత్వ సేకరణ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీ మారుతి వీరభద్రప్రసాద్, సీనియర్ నాయకులు రుద్ర ప్రదీప్, జిల్లా ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి, నాయకులు ఆకుల మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకాశ్‌నగర్ మున్నేరు బ్రిడ్జి వాహనదారులకు గుడ్‌న్యూస్

**- ద్విచక్ర వాహన రాకపోకలకు అనుమతించాలి**

**- పోలీసులకు మంత్రి తుమ్మల ఆదేశాలు**

క్రైం ఖమ్మం సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :
ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ మున్నేరు బ్రిడ్జి వాహనదారులకు గుడ్‌న్యూస్ ప్రకటన వెలువడింది మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఆదేశించారు. నగరానికి వివిధ ప్రాంతాలనుండి ఈ బ్రిడ్జి మీదుగా నిత్యం ద్విచక్ర వాహన దారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల తుపాను ప్రభావం వల్ల మున్నేరు ఫిల్లర్ వరద తాకిడికి దెబ్బతిన్న క్రమంలో ఆరు నెలలపాటు ఈ వంతెన పై రాకపోకలు నిలిపివేయాలని అడ్డుగోడ నిర్మించారు. దీంతో భారీ వాహనాలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించక పోయినప్పటికీ కనీసం టు వీలర్‌కు రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రస్తుతం పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని డామేజ్ రిపేర్ వద్ద పోలీస్ కాపలాతో పాటు భారీ వాహనాలు ప్రవేశించకుండా ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి చొరవ తీసుకోవాలని కోరారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు

**- సెకండ్ హ్యాండ్ వాహన కొనుగోలుదారులు అప్రమత్తం**

**- చైన్ స్నాచింగ్ సిసి కెమెరాలనుండి తప్పించుకొనే వారిపై నిఘా**

**- ద్విచక్ర వాహనాలకు ముసుగు వేసిన వాటికి గుర్తించాలి**

**- పోలీస్ కమీషనర్ సునీల్‌దత్**



క్రైం ఖమ్మం సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :
జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీల నేపథ్యంలో సెకండ్ హ్యాండ్ వాహన కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. మంగళవారం ఈ మేరకు పోలీస్ కమీషనరేట్ కార్యాలయంనుంచి విడుదల చేసిన ప్రకటన సారాంశం వివరాలు ఇలా వున్నాయి ఫైనాన్స్ తీసుకున్న ద్విచక్ర వాహనాలకు సరైన పత్రాలు నెంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ లేకుండా పట్టుబడిన క్రమంలో ఆటో ఫైనాన్స్ లో ఉన్న వాహనాల పత్రాలు తనిఖీ చేయాలని సూచించారు. ఇలాంటి పరిస్థితిలో కొంతమంది వాహనాలకు నెలవారీ వాయిదాలు చెలించలేని ద్విచక్ర వాహనాలను నిబంధనలకు విరుద్దంగా సీజ్ చేసి ఫ్రెష్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లేని వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కొన్ని సందర్భాల్లో రిజిస్ట్రేషన్ చేయకుండా అమ్మివేసి మిగతా డబ్బు రికవరీ చేసుకుంటున్నారని వీటిపై ఫిర్యాదులు వస్తున్నాయని తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఎవరైనా వ్యక్తులు వాహనాలు కొనుగోలు, అమ్మకాలు చేసిన ఎడల పత్రాలు పరిశీలించి రిజిస్ట్రేషన్ మార్పు చేసేకోవాలని లేని ఎడల ఏదైనా నేరాల్లో పట్టుబడి వాహనాలు గుర్తిస్తే సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. చైన్ స్నాచింగ్ దొంగతనాలు చేసిన నిందితులు పోలీసుల నుండి సిసి కెమెరాల నుంచి తప్పించుకోవడానికి ద్విచక్ర వాహనాల నెంబర్ ప్లేట్‌ను తొలగించడంతో పాటు చోరీ చేసిన వాహనాలతోనే ఎక్కువ నేరాలు జరుగుతున్నాయన్నారు. ఉద్దేశ పూర్వకంగా నిబంధనలు అతిక్రమించి జరిమానాలు తప్పించుకునేందుకు నెంబర్ ప్లేట్‌ని వంచినా, ముసుగువేసినా పూర్తిగా లేకుండా చేసిన వాటిని గుర్తించి సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ఆదేశించామన్నారు. పట్టుబడిన వాహన పత్రాలు చాయిస్ నెంబర్లు తనిఖీ చేసి చోరీకి గురైన వాహనాలు ఏమైనా ఉన్నాయో పరిశీలించుకొని వాహనాలు కొనుగోలు సమయంలో పోలీస్ కేసులు నమోదు చేశారోలేదో తెలుసుకోవాలన్నారు. ప్రధానంగా భీమా, ఆర్‌సి బుక్, చాయస్ నెంబర్, తయారీ తేదీ, పొల్యూషన్ సర్టిఫికట్ వంటి అన్ని పత్రాలు తప్పనిసరిగా సరిచూసుకోవాలని ఆదేశించారు.

## వరద బాధితులకు లకారం వాకర్స్ క్లబ్ చేయూత

**- ప్రతిఒక్కరికి సర్వే ద్వారా నిత్యావసర వస్తువులు**

క్రైం ఖమ్మం సెప్టెంబర్ 24, ప్రభాతవార్త :



ఖమ్మం నగరంలో లకారం చెరువు ప్రాంతంలో వరద తాకిడికి గురై నష్టపోయిన బాధితులకు మంగళవారం లకారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేయూత అందించారు. క్లబ్ తరపున ముందుగా సర్వే నిర్వహించి ఆ సర్వే ద్వారా నష్టపోయిన బాధిత కుటుంబాలను గుర్తించి కొంతమందిని ఎంపిక చేశారు. ముందుగా వారికి కూపన్లు అందచేసి నిత్యావసర వస్తువులను వాకర్స్ క్లబ్ కిట్లును పంపిణీ చేశారు. ఒక్కొక్క కుటుంబానికి 1000 రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ నిర్వాహకులు డిపిసి రావు, ఖాదర్‌బాబు, జనార్ధన్ రావులు మాట్లాడుతూ తమ క్లబ్ ద్వారా బాధితులకు ఆపన్నహస్తం కింద ఆదుకోవడం జరిగిందన్నారు. మానవతాదృక్పదంతో వరదల్లో నష్టపోయిన వారికి కొంతమేరకు ఆదుకున్నామని భవిష్యత్తులో కూడా తమ సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లకారం వాకర్స్ క్లబ్ సభ్యులు ఆ ప్రాంతంలో నివసిస్తున్న బాధిత నిరాశ్రయులు పాల్గొన్నారు.




# మున్సిపాలిటీలో పారిశుధ్యపనులు చేపట్టాలి

**- మణుగూరు పట్టణ సీపీఐ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్**

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :* మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో వెంటనే పారిశుధ్యపనులు చేపట్టాలని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అన్నారు. ఆయన మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మణుగూరు మున్సిపాలిటీలోని ప్రతివార్డులో కాల్వలు, డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన కొడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కనీసం బ్లీచింగ్‌పౌడర్ చల్లే పరిస్థితి కూడా మున్సిపాలిటీలో లేదని, ప్రజాసమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా, ఫోన్‌చేసినా స్పందించే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మణుగూరు మున్సిపాలిటీపై దృష్టిపెట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు సొందె కుటుంబరావు, ఎస్కేనాయుడు, తోట రమేష్, రాజబాబు, భిక్షం, సీతారాములు, రాములు పాల్గొన్నారు.



## ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :*



మణుగూరు మండలంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టు వార్షికోత్సవాల నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లతో పాటు రామానుజవరం, విజయనగరం, పీవీకాలనీ క్రాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించి సోదాలు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్రెంటీస్‌షిప్ గడువు పొడిగింపు

**- మణుగూరు ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్**

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :*



సింగరేణి సంస్థ యాజమాన్యం ఐటీఐ అభ్యర్థుల అప్రెంటీస్‌షిప్ గడువు పొడిగించినట్లు మణుగూరు ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2024–25 సంవత్సరంలో వివిధ ట్రేడుల్లో ఐటీఐ(ఎన్‌సీవీటీ) అభ్యర్థులకు సింగరేణిలో సంవత్సరం కాలవ్యవధితో కూడిన అప్రెంటీస్‌షిప్ కొరకు తొలుత ఈ నెల 23 తేదీలోపు ధరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించడం జరిగిందని, దానిని అభ్యర్థుల సౌకర్యార్థం ఈ నెల 30వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

## విద్యార్థులకు అభినందనలు

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :*



ఇటీవల హైదరాబాద్ భవనగిరిలో జరిగిన జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే, తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో మణుగూరుకు చెందిన విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు సీనియర్ లేడీకరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మణుగూరు సీఐ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంజిత్, విద్యార్థులు, కరాటేమాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం : కేసు నమోదు

*కరకగూడెం,ప్రభాతవార్త:*

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం జరిగింది. ఈ ఘటనపై మంగళవారం బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కరకగూడెం పోలీసులు తెలపారు.

## టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన నవీన్‌బాబు

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :*



తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం మణుగూరుకు చెందిన కాంగ్రెస్‌పార్టీ యువనాయకులు బుద్దరాజు నవీన్‌బాబు కలిశారు. ఇటీవల నూతన రాష్ట్ర పీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుద్దరాజు నవీన్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పోరాటఫలితమే కాంట్రాక్టు వర్కర్లకు లాభాలవాటా

**- మణుగూరు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికసంఘాల నాయకులు**

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :*



సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యపోరాటాల ఫలితమే సింగరేణి కాంట్రాక్టు వర్కర్లకు రూ.5వేలు లాభాలవాటా చెల్లింపు నిర్ణయమని మణుగూరు మండల అఖిలపక్ష కాంట్రాక్టు కార్మికసంఘాల నాయకులు అన్నారు. వారు మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాలవాటా రూ.5వేలు చెల్లింపు నిర్ణయంపట్ల హర్షం వ్యక్తం చేశారు. సింగరేణిలోని అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు లాభాలవాటా రూ.5వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆర్.మధుసూదన్‌రెడ్డి, గద్దల శ్రీనివాస్, జీవీ, డి.సుధాకర్, ఎస్.సాంబశివరావు, సంజీవరెడ్డి, భిక్షం, తోట రమేష్, జక్కుల రాజబాబు, రాజ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్యాలయాలు తనికీ చేసిన డిపిఓ

*కరకగూడెం,ప్రభాతవార్త:*

జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి మంగళవారం కరకగూడెం మండలంలోని పలు గ్రామ పంచాయితీ కార్యాలయాలను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయితీలలోని రికార్డులను పరిశీలించారు. బ్లీచింగ్. శానిటేషన్ రికార్డుల నిర్వహణ సచివాలయ సిబ్బంది తధితర అంశాలను కార్యదర్శి మారుతి డిపిఓకు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు..



## యువత నిస్వార్థ సమాజసేవ

**- మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య**

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :*



యువత నిస్వార్థంగా సమాజసేవ చేస్తున్నారని చదువుకుంటూ సామాజికసేవలో ఎన్ఎస్ఎస్ ద్వారా ఎంతో మంది భాగస్వాములవుతున్నారని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య అన్నారు. ఆయన మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ ప్రజాసేవ పథకం భారతదేశంలో అధికారికంగా 1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్ డేగా పాటిస్తూ వస్తున్నామన్నారు. ఉన్నత చదువులు చదువుతున్న నేటి యువతకు చదువు, విజ్ఞానంతో పాటు సమాజంపట్ల బాధ్యత, సేవాగుణం పెంపొందాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ జాతీయసేవా పథకాన్ని ఎన్ఎస్ఎస్ అని పిలుస్తారన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ వాలియా, స్టాఫ్ సెక్రెటరీ డాక్టర్ రమేష్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొక్కిలి భాస్కర్‌రావు, సాంబమూర్తి, అశోక్, జబ్బార్, సతీష్, శిరీష, నవీన, శ్రీకళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

*మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24 :*

సింగరేణి సంస్థ లాభాలవాటా పంపిణీలో కార్మికవర్గానికి తీవ్రమైన అన్యాయం చేయడాన్ని నిరశిస్తూ మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కూనవరం రైల్వేగేటు వద్ద రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ ఏరియా వైస్‌ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి సింగరేణి కార్మికులు సంస్థకు లాభాలు తెచ్చిపెడితే కాంగ్రెస్‌ప్రభుత్వం కార్మికులశ్రమను దోపిడీ చేసిందన్నారు. లాభాల పంపిణీలో కార్మికవర్గానికి తీవ్రమైన అన్యాయం జరిగిందని, ఇందుకు నిరసనగా రాష్ట్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు ఇజ్రాయిల్, బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, ముఖేష్, ఇమ్రాన్, సందీప్, మురళీకృష్ణ, రాజేష్, భరత్, సురేష్‌నాయుడు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి నికర లాభాలనుండి 33శాతం బోనస్ చెల్లించాలి

## ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేసి టిబిజికెఎస్ నిరసన..



*ఇల్లెందు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:*

సింగరేణి సంస్థకు ఈ ఏడాది నికరంగా వచ్చిన రూ.4.701కోట్ల లాభాల నుండి 33 శాతం బోనస్‌ను కార్మికులకు పూర్తిగా చెల్లించాలని టిబిజికెఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.రంగనాథ్, టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల బోనస్‌ను వ్యతిరేకిస్తూ టిబిజికెఎస్, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జగదాంబసెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మంగళవారం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాస్తవంగా వచ్చిన లాభాల నుండి అభివృద్ధి పేరిట రూ.2,389కోట్లను పక్కన పెట్టి కేవలం 2,412కోట్ల నుండి 33శాతం లాభాల వాటా పంచాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రతి కార్మికుడికి సగటున రూ.1.90లక్ష ఇస్తున్నామని మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022-23సంవత్సరంలో వచ్చిన రూ.2,222కోట్ల నుండి ఎటువంటి మినహాయింపులు లేకుండా 32శాతం అంటే దాదాపుగా రూ.710కోట్లను నాటి కేసిఆర్ ప్రభుత్వం పంచిందని గుర్తు చేశారు. నాడు సగటున ఒక్కో కార్మికుడికి లక్షా అరవైవేల రూపాయలు లాభాల వాటాగా వచ్చిందన్నారు. ఈ ఏడాది వచ్చిన 4.701 కోట్ల రూపాయల నుండి ప్రభుత్వం చెప్పిన విధంగా 33శాతం లాభాలు ప్రకటిస్తే 1,551 కోట్ల రూపాయలు కార్మికులకు పంచాల్సి ఉంది. అదే జరిగితే ఒక్కో కార్మికుడికి సగటున మూడు లక్షల డెబ్బైవేల రూపాయలు వస్తాయని తెలిపారు. జయపూర్ విద్యుత్ కేంద్రాన్ని స్థాపించినప్పుడు, నైని బ్లాక్ మొదలైనప్పుడు, సోలార్ ప్లాంట్ల నిర్మాణాలప్పుడు, కొత్త పనులు వచ్చినప్పుడు కానీ ఏ ప్రభుత్వం కూడా అభివృద్ధి పేరుతో నిధులను మళ్లించలేదన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను కాదని సింగరేణి స ంస్థలో ఎఐటియుసిని గెలిపించారని, జరుగుతున్న మోసాన్ని గ్రహించి కార్మికుల పక్షాన నిలబడాలని కోరారు. సింగరేణిలో పనిచేస్తున్న అవుట్ సోర్సి ంగ్ కార్మికులకు బోనస్‌ను అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తున్న ప్రభుత్వ విధానాలను కార్మిక లోకం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, దేవిలాల్, జెకె శ్రీను, శీలం రమేష్, పరుచూరి వెంకటేశ్వర్లు, కమ్మంపాటి రేణుక, ప్రమోద్, బావ్‌సింగ్, నబీ, జబ్బార్, గిన్నారపు రాజేష్, ఎలమందల వాసు, సన రాజేష్, రవితేజ, ఖాజా, సర్దార్, ఘాజీ, రాంలాల్ తదితరులున్నారు.




## కృష్ణ..కృష్ణ..ఈ రహదారికి మోక్షం ఎన్నడో..?

*ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:*



ఇల్లెందు పట్టణంలోని 8వ వార్డు భజన మందిరం గుడి ప్రాంతంలోని రహదారికి దశాబ్దాలు గడుస్తున్నా మోక్షం రావట్టేదు. శ్రీ కృష్ణ భజనమందిరంగా ఇల్లెందు పట్టణంలో పేరుగాంచిన ఈ ప్రాంతంలో గుడి చుట్టూత నుంచి నిత్యం వేలాది మంది వాహనదారులు, పాదచారులు వివిధ వార్డులకు వెళుతూ ఉంటారు. ఇంతటి రద్దీగా ఉండే ఈ ప్రాంతమంతా రహదారి మొత్తం గుంతలమయంగా పెద్ద పెద్ద కంకర తేలి ఉండటంతో వాహనదారులు తీవ్ర అవస్తలు పడాల్సిందే. పాలకులు మారుతున్నా ఈ ప్రాంతంలో రహదారి నిర్మాణానికి మాత్రం మోక్షం కలగడం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పుర అధికారులు, పాలకులు స్పందించి నిత్యం వేలాది మంది ప్రజలు ప్రయాణించే ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు. సాక్షాత్తు కృష్ణ భగవానుడి మందిరంను దృష్టిలో పెట్టుకునైనా స్పందించాలని పేర్కొంటున్నారు. కృష్ణ..కృష్ణ అధ్వాన్న రహదారికి మోక్షం కలిగించునాయనా అంటూ ఆ భగవంతున్ని వేడుకుంటుంన్నారు.

## కులనిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలి

*గుండాల, ప్రభాతవార్త:*



దేశంలో కులనిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నేటిక సమాజంలో కులం, మతం సమజాంలో జరగుతున్న వ్యత్యాసాలను తొలగించేందుకు అందరూ ముందుకు రావాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు బండారి ఐలయ్య, ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం ఆతీయ కన్వీనర్ ముక్తి సత్యం, ఎన్డీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. కుల నిర్మూలనకోసం ఆజన్మాంతం కృషిచేసిన సావిత్రిబాయి పూలే, జ్యోతిరావుపూలే ఆశయాలతో ముందుకెళ్దామన్నారు. మంగళవారం సత్యశోధకు సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుండాల మండలంలోని కాచనపల్లిలో నిర్వహించిన కులనిర్మూలనకు ఆచరణాత్మక సదస్సుకు అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి యనగంటి చిరంజీవి అధ్యక్షత వహించగా వక్తలు ప్రసంగించారు. సావిత్రి, జోత్యరావు పూలే ఇద్దరూ కుల నిర్మూలనకు ఎంతో కృషి చేశారని పాఠశాలల్లో విద్యాబుద్దలు నేర్పిస్తూనే కులాన్ని రూపుమాపేందుక వారి చేసిన కృషి ఎనలేదనిదన్నారు. అగ్ర కులాల వారు ఎంతగానో ఇబ్బందులకు గురిచేసినా వాటిని పట్టించుకోకుండా కులవివక్షతకు గురవుతున్న వారికి విద్యాబుద్దులు నేర్పిస్తూ మేథావులుగా తీర్చిదిద్దారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని సైతం మోదీ సర్కార్ కలారాసే యత్నం చేస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు వచ్చినా ఇంకా కులాల ముసుగులో దేశంలో జరుగుతున్న అరాచకాలను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భాజాపా ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలను నొక్కిపట్టేందుకు అనేక ప్రయత్నాలు చేస్తుందని ఈ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని ప్రజలు బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరం సీతారాములు, పూనెం రంగయ్య, బట్టు ప్రసాద్, డి. ప్రసాద్, కె.సారంగపాణి, మిరప రాజేశ్, పర్షిక రవి, కల్తి వెంకటేశ్వర్లు, బత్తిని సత్యం, శేఖర్, లాజర్, వై.వెంకన్న, భూషణం తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం తీసుకోవాలి

*టేకులపల్లి, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24:*



యుక్త వయస్సులోని బాలికలు పోషకాహారం తీసుకోవలని సీడీపీవో కేఎం తార తెలిపారు. టేకులపల్లి మండలంలోని సులానగర్ హైస్కూల్‌లో పోషకాహార అవగాహన, మెడికల్ అసెస్మెంట్ ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యుక్త వయస్సులో ఉన్న బాలికలు తీసుకోవాలసిన ఆహారం, ఫ్యూచర్ మెరుగ్గా ఉండటానికి వారికి అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు.సులానగర్ పీహేచ్‌సీలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించమని అన్నారు. సులానగర్ పీహేచ్‌సీ డాక్టర్ దీనేశ్, సులానగర్ హెచ్‌ఎం దాసు, సూపర్వైజర్లు బీ నిర్మల, జీ లక్ష్మి, యశోదమ్మ, అనురాధ, అంగన్వాడీ టీచర్లు రాజేశ్వరి, మంగతాయారు, పద్మ పాల్గొన్నారు.

## పొగాకు దూరంగా ఉండాలి

*టేకులపల్లి, ప్రభాతవార్త, సెప్టెంబర్ 24:*

యువత, వృద్ధులు పొగాకు దూరంగా ఉండాలని పొగాకు వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని టేకులపల్లి మండల సులానగర్ పీహేచ్ డాక్టర్ కందుల దీనేష్ పెర్కొన్నారు. టేకులపల్లి మండలంలోని సులానగర్ పీహేచ్‌సీలో పొగాకుపై టొబాకో ఫ్రీ క్యాంపెయిన్ 2.0ను మంగళవారం నిర్వహించారు. బారతదేశంలో ప్రతి సంవత్సరం 10 లక్షల పైగా మరణాలు కేవలం పొగాకు పిల్చడం ద్వారా అతనితో పాటు కుటుంబ సభ్యులు కూడా అనారోగ్య బారిన పడుతున్నరని అన్నారు. పొగాకు సేవించడం ద్వారా వచ్చే అనర్థాలను విద్యార్థులకుచ, యువతకు వివరించి పొగాకు వాడకాన్ని సమాజం నుంచి సమూలంగా నిర్మిలించాలని, దినికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మంగతార, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, అనురాధ, నిర్మల, లక్ష్మి, యశోద, పాల్గొన్నారు.

## సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీ

*గుండాల, ప్రభాతవార్త:*

నేడు రైతులకు ఆస్పిరేషన్ ప్రోగ్రాంలో బాగంగా గుండాలలో సంపూర్ణతా అభియాన్ కార్యక్రమంలో బాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సాయిల్ హెల్త్‌కార్డులను పంపిణీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటనలో పేర్కొంటూ వ్యవసాయ శాఖ ద్వారా సేకరించిన మట్టి నమూనాలకు సంబందించి సాయిల్ హెల్ద్‌కార్డులను బుధవారం ఉదయం 10,30గంటలకు రైతు వేదిక గుండాల నందు పంపిణీ చేయననట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు భూసార పరీక్షల ఆవశ్యకత, మట్టినమూనాల సేకరణ, హెల్త్ కార్డు ఉపయోగంపై వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

## బీఎల్‌వోలకు ఓటర్ నమోదుపై అవగాహన

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

దుమ్ముగూడెం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అశోక్‌కుమార్ అధ్యక్షతన బీఎల్‌వోలకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు కొత్త ఓటర్ల నమోదు, ఇంటింటి సర్వేపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎం.అశోక్‌కుమార్ మాట్లాడుతూ .. కొత్త ఓటర్ నమోదు ఫారం 6,7,8 లా గురించి వివరించడం, ఇంటింటి సర్వే నిర్వహించడంపై తగు సూచనలను ఇచ్చారు. అనంతరం బీఎల్‌వోలకు పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, బీఎల్‌వోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## శక్తివంతులుగా పౌరులను తీర్చిదిద్దే వేధిక ఎన్ఎస్ఎస్

*ఇల్లెందు అర్బన్, ప్రభాతవార్త:*

శక్తివంతులుగా పౌరులను తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ వేదికగా ఉపయోగపడుతుందని ఫైర్‌స్టేషన్ ఎస్ఐ నవీన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలను తినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో 2020లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బొజ్జాయిగూడెంలో వృద్ధులకు మూత్రశాలల నిర్మాణం కోసం గుంతలను తీసి మూత్రశాలల నిర్మాణం కోసం చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. వరదల సమయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన సహాయక కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా పచ్చదనం పరిశుభ్రత వంటి కార్యక్రమాలపై ప్రజలు అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. 1969 సెప్టెంబర్ 24 భారత ప్రభుత్వం ప్రారంభించిన ఎన్ఎస్ఎస్ 55 సంవత్సరాలుగా ఎంతో మంది పౌరులను శక్తివంతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో సఫలీకృతమవుతూనే ఉందన్నారు. విద్యార్థులు విధ్యతో పాటుగా దేశ సేవలో, దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషించేందుకు ఎన్ఎస్ఎస్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామలింగేశ్వర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తోర్తి జాన్, విలియం ప్రసాద్, లైబ్రేరియన్ కలం ప్రసాద్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులు సేవా భావంతో మెలగాలి

### కళాశాల ఎడి డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
విద్యార్థులు సేవా భావంతో మెలగాలని స్థానిక వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ



సేవా పథక దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఎంతో కొంత సేవా చేయాలని



అందులో ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత, చెట్లు పెంపకం, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పలు అవగాహన కార్యక్రమాలో భాగస్వాములపై దేశ సేవలో పాలుపంచుకోవాలన్నారు. ఈ క్రమంలో జాతీయ స్థాయిలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన వారిని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం రాంప్రసాద్, శ్రావణ్ కుమార్, రెడ్డి ప్రియ పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేసిన జారె

దమ్మపేట, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
దమ్మపేట మండలంలో జరిగిన స్కూల్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడా కారులను అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అభినందించి బహుమతులు అందజేశారు. స్థానిక పోలీస్



స్టేషన్ వద్ద గల ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో జరిగిన ఈకార్యక్రమంలో పాల్గొన్న జారెకు యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసాశారు. అదే విధంగా జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు అభినందించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ లక్ష్మి, పాఠశాల సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ఫిజియోథెరపీ సద్వినియోగం చేసుకోవాలి

దమ్మపేట, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
మండల కేంద్రం దమ్మపేటలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియెథెరఫీ



శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఆర్జెడి సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఫిజియోథెరఫీ శిబిరాన్ని స్థానిక ఎంఇఓ లక్ష్మితో కలిసి పరిశీలించారు. శిబిరంలో నేర్చుకున్న అంశాలు సాధన చేయడం ద్వారా మంచి పలితాలు ఉంటాయని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ ప్రభాకర్‌రావు, ఐఇఆర్‌టిలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం గ్రామ శాఖా కార్యదర్శుల ఎన్నిక

దమ్మపేట, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:
సిపిఎం పార్టీకి సంబంధించి ప్రతీ 3 సంవత్సరాల కోసారి జరిగే



మహాసభల్లో భాగంగా మండలంలోని గ్రామ శాఖల నియామకం జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మొద్దులగూడెం శాఖ నూతన కార్యదర్శిగా చెనుబోయిన బ్రహ్మయ్య, ఆర్లపెంట శాఖా కార్యదర్శిగా కూరం గోపిరాజు, బొల్లిగట్టు కార్యదర్శిగా పెనుబల్లి లక్ష్మణరావు, శ్రీరాంపురం కార్యదర్శిగా షేక్ జాన్ పాషాలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

## పశు వైద్య శిబిరం విజయవంతం

తల్లాడ, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త
మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు వైద్య సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ నిషి జోషి 22 పశువులకు వైద్య పరీక్షలు జరిపి వాటికి గర్భకోశ వ్యాధులకు సంబంధించి చికిత్స అందించారు. 45 గేదె దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించి, అధిక పాల దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్లు టి. నాగభూషణం, ఎం. వెంకటేశ్వర్లు, జూనియర్ వెటర్నరీ అధికారులు నాగరాజు, చుక్కారావు, గోపాలమిత్రలు ఆర్. లక్ష్మణరావు, ఎం. బాబురావు, డి. వెంకటేశ్వర్లు, దాసు, రమేష్, సత్యనారాయణ, తల్లాడ క్లస్టర్ గోపాలమిత్ర సూపర్‌వైజర్ టి. నాగభూషణం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### తాహశీల్దార్ నరేష్

దమ్మపేట,ఏజెన్సీ,సెప్టెంబర్ ,24,ప్రభాతవార్త ;



భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాహశీల్దార్ చందా నరేష్ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.మంగళవారం భారీ వర్షాలతో పిడుగులుపడి మండల పరిధిలో ఇద్దరు మృత్యువాత పడ్డారని భారీ వర్షానికి పిడుగులు పడే లవకాశం ఉన్నందున కూలీ పనుల చేసుకునే వారు,రైతులు ,కార్మికులు, తగుజాగ్రత్తలు పాటించాలని అలాగే చేరువులు,వాగుల ప్రవహం వద్దకు పిల్లలు వెళ్ళ కుం డా తల్లి తండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు,చేపల వేటకు వెళ్ళ వద్దని తెలిపారు,వరదల వల్ల ఎటువంటి ఇబ్బంది వచ్చిన తమ సిబ్బందికి లేదా పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందచేయాలని తెలియ చేశారు.

## కాంగ్రెస్ నాయకులు యరమల వెంకటేశ్వరరెడ్డి హఠాన్మరణం

### ముద్దునూరులో విషాదం

తల్లాడ, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త
ముద్దునూరు మాజీ సర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకులు యరమల వెంకటేశ్వరరెడ్డి (56) మంగళవారం హైద్రాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. తల్లాడ మండలంలో వెంకటేశ్వరరెడ్డి టిడిపిలో 30 సంవత్సరాలకు పైగానే క్రియాశీలకంగా పనిచేయగా, ముద్దునూరు మాజీ సర్పంచ్‌గా తన అనుచరులను సర్పంచ్‌గా, ఎంపిటిసిగా గెలిపించిన సత్తా గల నాయకుడు. ప్రస్తుతం వెంకటేశ్వరరెడ్డి కుర్నవల్లి పిఏసిఎస్ డైరెక్టర్‌గా ఉన్నారు. మొదటి నుండి గ్రామంలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయిలో ఉండగా వెంకటేశ్వరరెడ్డికి ప్రత్యర్థిగా ఉన్న నల్లబోతు రామారావు మూడు నెలల క్రితమే గుండెపోటుతో మృతిచెందగా వెంకటేశ్వరరెడ్డి ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వెంకటేశ్వరరెడ్డి మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్‌గా పనిచేశారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు అనుచరుడిగా పనిచేశారు. ఇటీవల పొంగులేటి ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. మండలంలో తనకంటూ ఓ గుర్తింపు ఉన్న వెంకటేశ్వరరెడ్డి క్రమేణా ఆర్థిక పరిస్థితులకు తోడు ఆధిపత్యంలో వెనుకబడ్డారని చెప్పవచ్చు. వెంకటేశ్వరరెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మరణంతో ముద్దునూరు, రంగాపురం గ్రామాలలో విషాదం నెలకొనగా బుధవారం అంత్యక్రియలు జరగనున్నాయి.

## హైద్రాబాద్‌లో సభకు తల్లాడ రేషన్ డీలర్లు హాజర్లు

తల్లాడ, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త
రేషన్ డీలర్ల సమస్యల సాధన కోసం మంగళవారం హైద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన సభకు తల్లాడ మండలం నుండి డీలర్లు హాజరయ్యారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్‌తో హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.



# క్రాంతి కళాశాలలో జాతీయ సేవ వ్యవస్థాపక దినోత్సవం







**వైరా, సెప్టెంబర్24,ప్రభాతవార్త:** స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సేవ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి స్ఫూర్తితో విద్యార్థులు నిజ జీవితంలో సేవా తత్పరత పెంచుకోవాలని సమాజ శ్రేయస్సు కోసం తమదైన శైలిలో ప్రతిఒక్కరూ శ్రమించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు చదువుతో పాటుగా జ్ఞానాన్ని సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని, అర్థవంతమైన భవిష్యత్తు నిర్మాణం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని వివరించారు. ఎన్ఎస్ఎస్ చిహ్నం నిరంతరాయంగా మార్పును సూచిస్తుందని, మానవజాతి సంక్షేమాన్ని కోరుకుంటుందని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామస్తుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, గ్రామ పునర్నిర్మాణం కోసం, వీలైనంత సహాయపడాలని సామాజిక సమస్యలపై అవగాహన కలిగి ప్రకృతి విపత్తుల సందర్భంగా సహకారాన్ని అందించాలని, పర్యావరణాన్ని పరిరక్షణకు తోడ్పడాలని వివరించారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం, ధూమపానం, మద్యపానం, వాటి వలన కలిగే అనర్థాలను మీ గ్రామాల్లో నివాస ప్రాంతాల్లో తెలియజేయాలని సూచించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ పివో లింగారావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు, మజీద్, వేణు, నరేందర్, నాగలక్ష్మి, చైతన్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేద మహిళలకు కుట్టుమిషన్ వితరణ

**వైరా, సెప్టెంబర్24,ప్రభాతవార్త:** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైరా సాయిబాబా మందిరంలో కొణతాలపల్లి నగేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ సభ్యులు అమ్మ వటర్ ప్లాంట్ అధినేత నగేష్ పుట్టినరోజు పురస్కరించుకొని వైరాకు చెందిన గరిడేపల్లి సత్యవతి అనే మహిళకు రాయితీతో కూడిన కుట్టుమిషన్‌ను ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతుల మీదుగా వైరా సాయిబాబా మందిరంలో క్లబ్ సభ్యులతో కలిసి అందించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి సభ్యులంతా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వైరా లయన్‌సక్లబ్ నుండి జీవనోపాధి కోసం అనేక మంది మహిళలకు రాయితీతో కూడిన కుట్టుమిషన్‌లు అందించామని తెలిపారు. చాలామంది మహిళలు సద్వినియోగం చేసుకొని కుటుంబ పోషణకు తోడ్పడుతున్నారని అన్నారు. క్లబ్ నుండి అందించిన వాటిని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అబ్బూరి రమేష్, కోశాధికారి మరికంటి రాంగోపాల్‌దాస్, ఉపాధ్యక్షులు కొల్లా రాంబాబు, 5వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, క్లబ్ మహిళా కోఆర్డినేటర్ గద్దె నీరజ, కట్ల సురేష్, గజ్జల కృష్ణమూర్తి, డాక్టర్ దారెల్లి కోటయ్య, పిచ్చిరెడ్డి, రంగా సత్యనారాయణ, తాటికొండ రాము తదితరులు పాల్గొన్నారు.




# అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి

## నాడు ఢిల్లీలో జరిగే ధర్నాను జయ ప్రదం చేయండి

## తెలంగాణ రైతు సంఘం



**కొణిజర్ల, సెప్టెంబర్ 24., ప్రభాతవార్త:** దేశ వ్యాపితంగా అడవి జంతువుల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 25న బుధవారం చలో ఢిల్లీని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలో గల గద్దల గూడెం గ్రామం లో సిపిఎం గ్రామ మహా సభ సందర్భంగా జరిగిన రైతు సభలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొందు రాంబాబు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ మాట్లాడుతూ మాట్లాడుతూ పులులు, ఏనుగులు, కోతులు అడవి పందులు, నెమళ్ళ వలన పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ అభయ అరణ్యాల దగ్గర సాగు చేస్తున్న రైతుల పంటలు పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయని అన్నారు 2018 నుండి ఇప్పటివరకు దేశంలో పులుల వలన 300 మంది పైగా రైతులు చనిపోయారని అన్నారు. ఏనుగుల వలన 2700 మంది రైతులు చనిపోయారని అన్నారు. కోతులు వలన కూడా వందలమంది రైతులు చనిపోయారు వీరికి ఎలాంటి పరిహారం కేంద్ర ప్రభుత్వం నుండి రావడం లేదని అన్నారు. పంటలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడిసాగు చేసిన పంటలను పెట్టుబడి పెట్టి, చేతికి వచ్చిన సమయంలో అడవి జంతువుల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని అన్నారు ఈ పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు పంటల నష్టం తో పాటు మనుషులు కూడా చనిపోతున్నారని అన్నారు కనీస పరిహారం ఇవ్వడం లేదని ఆయన అన్నారు తెలంగాణ రాష్ట్రంలో కోతులు అడవి జంతువుల వల్ల పంటలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని అన్నారు. ఈ పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల నష్టం తో పాటు మనుషులు కూడా చనిపోతున్నారని అన్నారు. కనీస పరిహారం ఇవ్వడం లేదని ఆయన అన్నారు తెలంగాణ రాష్ట్ర లో కోతులు అడవి పందులు, నెమళ్ల వలన పంటలనే మార్పిడీ చేసుకుంటున్నారని అన్నారు వీటిపై దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఈ నెల 25న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ ధర్నాలు రైతాంగం పంటలు దెబ్బతిన్న వాళ్ళు, అడవి జంతువుల వల్ల మరణించిన కుటుంబాలు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గద్దల గూడెం మాజీ సర్పంచ్ పూల్లూరి వెంకటేశ్వరరావు, సిపిఎం గ్రామ కార్యదర్శి తేజావత్ సీతారాములు, చల్లా రాములు, చల్లా వెంకటనారాయణ, రేమల్ల కృష్ణ, హనుమంతు, భూ లక్ష్మి, వంశీ, రవి, ఎర్రగాని కృష్ణ కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.








## ఆ పంచాయితీలలో మద్యపానం నిషేదం

### మద్యం విక్రయిస్తే 50వేలు జరిమాన

**కరకగూడెం,ప్రభాతవార్త:** కరకగూడెం మండలం చిరుమళ్ళ,వట్టం వారిగుంపు పంచాయితీలలోని మహిళలు మంగళవారం వట్టం వారిగుంపు పంచాయితీ కార్యాలయంలో సమావేశమై ఈ సందర్భంగా ఆ రెండు పంచాయితీలలో మద్యపానం నిషేదించాలని ఎవరైనా మద్యం విక్రయించినా, సేవించిన 50 వేల రూపాయలు జరిమాన విధించాలని గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానించుకున్నారు..అనంతరం తహశీల్ కార్యాలయంలో మండల తహశీల్దార్ నాగప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన పుట్ట గొడుగుల్లా బెల్టు షాపులు వెలుస్తున్నాయని మద్యం విక్రయాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని దానివల్ల అక్కడ నివసించే కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని యువత తప్పతాగి వారి బంగారు భవిశ్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని గుడుంబా,బెల్టుషాపుల వల్ల చాలామంది అనారోగ్యం పాలై ప్రాణాలు పోగొట్టుకున్న సందర్భాలు కూడా లేకపోలేదని గుర్తుచేశారు.అధికారులు స్పందించి వారి గ్రామాలకు మద్యం రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## కాంగ్రెస్ అంటే ప్రజలకు ఒక నమ్మకం



**కరకగూడెం,ప్రభాతవార్త:** కరకగూడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ..కాంగ్రెస్ అంటే ప్రజలకు ఒక నమ్మకం కాంగ్రెస్‌కు అధికారమే పరమావధికాదు.ఇది ప్రజా సంక్షేమ సిద్ధాంతాల మీద నడిచేపార్టీ.మడమ తిప్పని,మాట తప్పని,ప్రజలపార్టీ ప్రజల పక్షాన నిలబడతామని అన్నారు. తెలంగాణలో ప్రజల దీవెనలతో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిందని ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేసిందన్నారు.పండించిన పంటకు గిట్టుబాటు ధరతోపాటు రూ.500బోనస్ కూడా ఇస్తున్నామన్నారు.పినపాక నియోజక వర్గానికి 3500 ఇళ్లు వస్తాయన్నారు.ఇళ్లులేని నిరుపేదలు ఇళ్లు నిర్మించుకోవచ్చని అన్నారు.10సంవత్సరాల అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని ప్రజా పాలనలో అన్నివర్గాల వారికి న్యాయం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## మొక్కలను నాటిన తహసిల్దార్, ఎంపీడీవోలు

**భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :** గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల నందు భద్రాచలం తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుజాత చేతులమీదు గా మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించా రు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు ఉమాశంకర్‌నాయుడు, ఉపాధ్యాయురాలు ఉషారాణి, తుమ్మలపల్లి ధనేశ్వరరావు పాల్గొన్నారు.



## సింగరేణి కార్మికులకు లాభాల వాటా సాధించిన ఘనత ఏఐటీయుసిదే

### రూ. 30 వేల కోట్లు అప్పులు చేసి సింగరేణిని ముంచింది బీఆర్ఎస్ నాయకులే

### ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కె. రాజ్ కుమార్

సత్తుపల్లి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

సింగరేణిలో కార్మికులకు లాభాలవాటా సాధించి పెట్టిన ఘనత ఏఐటియుసిదేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్ కుమార్ అన్నారు. సింగరేణిలో లాభాల వాటా పర్మినెంట్ కార్మికులకు 1998లో కామ్రేడ్ మహేంద్ర నాయకత్వంలో 10శాతం లాభాల వాటా సాధించిన ఘనత అప్పటి నుండి ఇప్పటి వరకు



33 శాతం వరకు సింగరేణి కార్మికులకు లాభాల వాట సాధించిన ఏకైక సంఘం ఏఐటియుసిదేని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో బ్రాంచ్ కార్యదర్శి ధార భీమయ్య, అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కులు, పరిరక్షణ కోసం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కార్మిక సంఘం ఎంతో మంది నాయకులను పోగొట్టుకుందని, వారిలో శేషగిరిరావు, గిరిప్రసాద్, కొమరయ్య, నర్సయ్య, భాస్కర్‌రావు, బుల్లి ఎద్దుల ఆనందం , మహేంద్ర వంటి ఎందరో త్యాగధనులు పోరాటంతో ఈ సింగరేణి సంస్థను కాపాడుకోవడం జరిగిందని ఆయన అన్నారు. ఎర్ర జెండా నాయకత్వంలో సింగరేణి హక్కుల కోసం, సింగరేణి కార్మికుల కోసం నిరంతరం పోరాడుదామని, లాభాలవాట గురించి అవాకులు, చెవాకులు పేలుతున్నటువంటి బీఆర్ఎస్, టిబిజికెఎస్ నాయకులకు అడిగే హక్కు లేదని రాజ్ కుమార్ అన్నారు. సింగరేణిలో రూ. 30 వేల కోట్లు అప్పులు చేసి సింగరేణి సర్వస్వం ముంచింది బీఆర్ఎస్ నాయకులేనని, ఇవాల లాభాలవాట గురించి అడిగే హక్కు వారికి లేదని అన్నారు. సింగరేణి కార్మికుల పెన్షన్ కూడా ఏఐటియుసి సాధించిందని, కార్మికుల సొంత ఇంటి పథకంలో దానిని కూడా ముందుకు తీసుకొచ్చి ప్రతికార్మికుడు దిగిపోయే నాటికి సొంత ఇంట్లో ఉండే విధంగా ఇప్పటికే సింగరేణి సిఎండి బలరామ్ నాయక్‌తో మాట్లాడటం జరిగిందని రాజ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, జి. వీరస్వామి, సెంట్రల్ బ్రాంచ్ కార్యదర్శి ఘట్టయ్య, బ్రాంచ్ నాయకులు ఎన్. సుదాకర్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు జి. నర్సింహారావు, ఫిట్ కార్యదర్శి సూర్య ప్రకాష్, కె. వెంకటేశ్వర్లు, ఉపేంద్రాచారి, డి. నర్సింహారావు, వీరభద్రం, సురేష్, సందీప్, కోటి, బాలసుబ్రహ్మణ్యం, పాషా, మురళీ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్తక సంఘం అధ్యక్షునిగా నాగుబండి

పెనుబల్లి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త

పెనుబల్లి మండలం, వీయం.బంజర్ వర్తక సంఘం అధ్యక్షునిగా నాగుబండి ప్రభాకర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్‌గా కొణిజేటి కృష్ణారావు, గౌరవ అధ్యక్షులుగా ఆచంటి పుల్లారావు, ట్రెజరర్‌గా కేశేపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మిట్టపల్లి నరేంద్ర, సహాయ కార్యదర్శిగా పాలెపు సతీష్‌లు ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు ఆచంటి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.



## జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో బహుమతులు సాధించిన " శ్లోక్ల కిరణ్ "

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శ్లోక కిరణ్

సత్తుపల్లి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:



సత్తుపల్లి పట్టణ సీఐ టి. కిరణ్ కుమార్తె శ్లోక కిరణ్ స్కేటింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి చదువుతున్న డిఏవి పాఠశాల పేరు నిలబెట్టింది. ఖమ్మం జిల్లా రోరల్ స్కేటింగ్ చాంపియన్ షిప్ 2024 వారి ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ కాంపిటేషన్ పోటీల్లో సత్తుపల్లి మండలం, గంగారం సాయి స్ఫూర్తి డిఏవి స్కూల్ విద్యార్థిని శ్లోకా కిరణ్ జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించి పాఠశాల పేరును నిలబెట్టింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తనుకు శేషసాయిశ్రీ మాట్లాడుతూ విద్యార్థిని శ్లోకా కిరణ్ అండర్ 7-9 కాడేట్ రింక్ 4.1, (200మీటర్లు) విభాగంలో సిల్వర్ మెడల్, రోడ్,3 (100 మీటర్లు ) విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయిలో త్వరలో జరిగే రోలర్ స్కేటింగ్ పోటీలకు శ్లోక కిరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. విజేతకు, విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పీడీ కె. కుమార్ స్వామి, పిడిఎం రామిశెట్టిలను సాయి స్ఫూర్తి హానర్ చైర్మన్, రాజ్య సభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి, డీఏవి ఏపి జోన్ రీజనల్ ఆఫీసర్ జిఆర్‌కె. ప్రసాద్,సాయి స్ఫూర్తి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బండి అన్విద, సాయి స్ఫూర్తి కళాశాల ప్రిన్సిపల్ శేషారత్న కుమారిలు జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన శ్లోక కిరణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరం

### - ఎంపిడిఓ యం. చంద్రమౌళి

తల్లాడ, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంపిడిఓ యం. చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అంబేద్కర్ నగర్‌లోని డాన్‌బాస్కో పాఠశాలలో నాలుగు మండలాల స్థాయి జోనల్ క్రీడలను ప్రారంభించినం అనంతరం హెచ్ఎం పారుపల్లి ప్రసూన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యం అని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు చదువు ఒక్కటే ప్రధానం కాదని, చదువుతో పాటు క్రీడల్లో ఆశక్తి కనబరిస్తే క్రీడల్లో అవకాశాలు కూడా వస్తాయని గుర్తు చేశారు. క్రీడల నిర్వాహకురాలు పారుపల్లి ప్రసూన మాట్లాడుతూ నాలుగు మండలాల స్థాయి క్రీడలు తల్లాడలో నిర్వహించడం అభినందనీయం అని కార్యక్రమానికి తాను అధ్యక్షత వహించే అవకాశం దక్కడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎన్. దామోదర ప్రసాద్, ఉపాధ్యాయులు ఉంగరాల వెంకటేశ్వర్లు, ప్రసాద్, పలువురు పీడీలు పాల్గొన్నారు.

**క్రీడల నిర్వహణపై అసంతృప్తి..**

నాలుగు మండలాలకు సంబంధించి డాన్‌బాస్కోలు నిర్వహించిన క్రీడల్లో ఉదయం గం. 9.00లకే విద్యార్థులు హాజరు కాగా, క్రీడలను ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారనే విమర్శలు వచ్చాయి. 9.00లకే ఎండ తీవ్రంగా ఉండగా నాలుగు మండలాల స్థాయి క్రీడలను ప్రారంభించడం రెండు గంటలు ఆలస్యం కావడంతో విద్యార్థులు వారికి కేటాయించిన ప్రదేశంలో ఎండలో అలాగే కూర్చోవడంతో హాజరైన క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు. భవిష్యత్తులోనైనా విద్యార్థుల జీవితాలతో ఇలాంటి ఆటలు ఆడుకోవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.






## శాస్త్రీయ నృత్యంలో కూచిపూడికి అగ్రస్థానం

### ఆశా వ్యవస్థాపకులు డా. దయానంద్

సత్తుపల్లి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

భారతీయ శాస్త్రీయ నృత్యాల్లో కూచిపూడి అగ్ర స్థానంలో నిలచిందని ఆశా స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వాహకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అన్నారు. వెంపాటి మోహన్‌రావు కూచిపూడి డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థులకు ఇచ్చిన



శిక్షణ అనంతరం విశ్వశాంతి విద్యాలయంలో వారికి సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది. ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డా. మట్టా దయానంద్ మాట్లాడుతూ కూచిపూడి భారతదేశానికి చెందిన ప్రాచీన నృత్యమని, తెలుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, కృష్ణాజిల్లా కూచిపూడిలో పుట్టిన శాస్త్రీయ నృత్యం కూచిపూడి నృత్యంని ఆయన అన్నారు. 10 నెలల క్రితం విశ్వశాంతి వేదికగా సత్తుపల్లిలో నాట్యా చారిని అనూ మాస్టర్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం ప్రారంభమైందని, 10 నెలల వ్యవధిలో ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు కాకినాడ, ఏటూరు, హైదరాబాదు తదితర నగరాల్లో అద్భుత ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా సత్తుపల్లికి వన్నె తెచ్చారని మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్యాన్సర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాలువలకు గండ్లు.. ఎండుతున్న పంటలు..

### ఆందోళనలో రైతులు...

### పంటలపై ఆశలు వదులుకుంటున్న వైనం..

కల్లూరు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త

భారీ వర్షాల కారణంగా సాగర్ కాల్వకు గండ్లు పడటంతో పంటలు ఎండిపోతున్నాయి. గత మూడు రోజుల క్రితం గండ్లు పూడ్చి నీటిని వదిలారు. మూడు గంటల లోపే బుంగ పడి వృధాగా అయిపోయినాయి. అధికారులు నిర్లక్ష్యం, ఇంజనీర్లు లోపంతో మళ్లీ బుంగ పడటం తో రైతులకు శాపంగా మారింది. జిల్లాల్లో ముగ్గురు మంత్రులు ఉండి ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడం వలన ఇంత నిర్లక్ష్యం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. సాగర్ ఆయకట్టు పరిధిలో కల్లూరు మండలంలో 20,000 ఎకరాలలో పత్తి, మిర్చి, వరి పంటలను సాగు చేస్తున్నారు. ఒక్క ఎకరాకు 30000 ఖర్చుతో నేటి వరకు ఇప్పటివరకు సాగు చేస్తూనే ఉన్నారు. ఆకస్మాత్తుగా సాగర్ కాల్వకు సూర్యాపేట, పాలేరు వద్ద గండ్లు పడలంతో రైతులు వాగులు, వంకలు, నేలబావులు వద్ద ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడుతున్నారు. ఆయిల్ ఇంజన్లు ఉన్న యజమానులను డిమాండ్ పెరిగింది. గంటకు అద్దె రూ. 400కు పైగా వసూలు చేస్తున్నారు. గత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు కలిసి రాలేదు. ఈ సంవత్సరం అధిక వర్షాలతో కాల్వకు గండ్లు పడటం వలన పంటలు ఎండిపోయే పరిస్థితుల్లో దిగాలు పడ్డారు. ఈ సంవత్సరం కూడా ప్రాజెక్టుల్లో నిండు కుండలా నీరు ఉండి కూడా రైతులకు అందించలేని పరిస్థితుల్లో అధికారులు, ప్రభుత్వం ఉందని రైతులు చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో రైతులు పంట పొలాలను రక్షించేందుకు ఆయిల్ ఇంజన్లతో నీటిని తోడుతూ భగీరథ యత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా నీరు అందడం కష్టం, పంటలు ఎండిపోవడం ఖాయం అప్పుల్లో రైతులు అని రైతులు ఒకరినొకరు చర్చించుకుంటున్నారు.



## 3దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్న చార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ

**కామేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

కామేపల్లి మండలంలో 3దశాబ్దాలుగా చార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఏజెన్సీ ప్రాంత ప్రజలకు, రైతులకు విశేష సేవలందిస్తుంది.1994 సెప్టెంబర్ నెలలో (సెంటర్ ఫర్ హ్యూమన్ యాక్టివిటీ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్) చార్డు సంస్థ స్థాపించబడింది.జనవరి 9, 1995న కామేపల్లి మండల పరిధిలోని బిల్లుడు తెరప, శ్రీరామ్‌నగర్, అబ్బాస్‌పురం గ్రామాల్లో చార్డ్ కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్లను ప్రారంభించింది.జూన్ 17, 1995న ఖమ్మం డీఆర్టీఏ మద్దతుతో కామేపల్లి మండలానికి చెందిన గ్రామీణ యువతకు కార్పెంటర్, బార్ బార్, మెకానికల్, ఎలక్ట్రిషన్‌పై నిరుద్యోగ నైపుణ్యం గల టూల్ కిట్లు 20పంపిణీ చేసింది.డిసెంబర్ 28,1996లో చార్డ్ సెర్ప్ కేంద్రాన్ని బిల్లుడు తెరపలో ప్రారంభించింది.గిరిజన గ్రామం బిల్లుడు తెరప.1-5 సంవత్సరాల పిల్లలకు ఫీడ్ అందించింది..ఖమ్మం పట్టణంలో సైతం 5పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేసింది.బాల కార్మికుల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ కొరకు అవగాహన శిబిరాలు నిర్వహించింది.5సెప్టెంబర్ 1997లో ఖమ్మం నెహ్రూ యువక కేంద్రం ఉత్తమ యువజన పురస్కారాన్ని అందజేసింది.కామేపల్లి, చింతకాని, వైరా మండలాల్లో సుస్థిర వ్యవసాయం, నాన్ పెస్టిసైడ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాములను నిర్వహించింది.డిసెంబర్ 16, 2006లో కామేపల్లి మండలంలో 6గ్రామాల్లో రైతు పురుగుమందుల రహిత వ్యవసాయం కోసం ఆర్థిక తగ్గింపు కొరకు ఆర్గానిక్ ఫార్మింగ్, వర్మి కంపోస్టు ఏర్పాటు చేసింది.అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని మానవహారంతో బాలల హక్కుల పరిరక్షణ,బాలకార్మిక రహిత సమాజం పై కామేపల్లి మండలంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహించారు.ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు జరిపి అవసరమైన వారికి మందులను డాక్టర్లు సిబ్బంది ద్వారా అందించారు.63మంది విఎస్ఎస్ సభ్యులకు గిరిరాజా కోళ్ళ పెంపకం పై శిక్షణ ఇవ్వడం జరిగిందని, 38మందికి కంటటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్‌లు వైద్యులతోచేయించి కళ్ళద్దాలు అందజేశారు.నాబార్డ్




ద్వారా 213మంది మహిళా సభ్యులకు రుణాలను అందించి ఆజోల్ల సాగు పాడి మేత, జంతువులకు మేతపై అవగాహన కల్పించారు. మిక్సింగ్ గ్రైండర్‌లను కూడా వారికి అందించారు.పిల్లలను ఉన్నత చదువులు చదివించడం కొరకు వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడం ద్వారా మహిళలు ఈ ప్రాజెక్టు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందారు.మండల పరిధిలోని 7గ్రామాల్లో చార్డు ద్వారా ఈ ప్రాజెక్టును అమలు చేశారు.మహిళా సాధికారిత, మహిళలపై అఘాయిత్యాలు, గృహహింస చట్టం 2005, సమాచార హక్కు చట్టం కోసం కూడా పనిచేసింది.ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలో 40గ్రామాల్లో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు.గుణాత్మక చర్యలు ద్వారా విద్యను అందించారు.పిల్లలకు, గిరిజనుల జీవనోపాధి అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చింది.హార్టికల్చర్ అనుబంధ కార్యకలాపాలతో కూడిన మామిడి, ఉసిరి తోటలను అందించారు.అంతర పంటల అభివృద్ధి స్వయం పోషణ కుటుంబానికి మద్దతు కోసం మహిళల శిక్షణ, ఆరోగ్య పరీక్షలు సుస్థిర వ్యవసాయ పద్ధతులు అమలు చేశారు..ఆగస్టు 8,2018న రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యత్వాన్ని మెరుగుపరచడానికి వారి ప్రాంతాల్లో ఎఫ్‌పివోలను బలోపేతం చేయడానికి దళారులను తగ్గించి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేసింది.జూలై 24,2023ఆగస్టు 1 నుండి 23వరకు నేషనల్ బిల్డింగ్‌లో దాని పాత్ర గురించి జిల్లా పాఠశాలల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించి 18పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు విరివిగా యాలని ఆయన కోరారు.ఈ మేరకు ప్రచారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ప్రేమ వివాహ కార్యక్రమం లో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్

**కామేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన తేలు నారాయణ విజయ కుమారి దంపతుల ఏకైక కుమారుడు పివైఎల్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేష్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులపాడు గ్రామానికి చెందిన పూల ప్రభాకర్ పెంటమ్మల ఏకైక కుమార్తె పూల సోనీ ల ప్రేమ వివాహం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కొత్త లింగాలలలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో పార్టీ పెద్దలు, బంధువులు, శ్రేయోభిలాషుల మధ్య నిరాడంబరంగా మంగళవారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని ప్రేమ వివాహం చేసుకుంటున్న నూతన వధూవరులను అభినందించి, అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజులలో కుల, మతాంతర వివాహాలే ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నదని, యువతీ యువకులు ప్రగతిశీల సమాజాన్ని, అభ్యుదయ మార్గాన్ని, సమ సమాజ నిర్మాణాన్ని కోరుకుంటున్నారని, దీనివలన



వరకటన్న వేధింపు సమస్యలు, ఆత్మహత్యలు పూర్తిస్థాయిలో తగ్గే అవకాశం ఉందని ప్రేమ వివాహం చేసుకున్న జంటను మనస్ఫూర్తిగా అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె ఫత్తే మహమ్మద్, జిల్లా సిపిఐ నాయకులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ఎల్‌హెచ్‌పిఎస్ మండల అధ్యక్షలు భూక్యా నాగేంద్రబాబు నాయక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, ఇమ్మడి రామనాథం, అంబడిపూడి సత్యం, జక్కంపూడి వెంకటేశ్వర్లు, సిరిపురపు రవి, స్నేహితులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

**కామేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజీజేఏసీ తరపున అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘం ఏర్పాటు చేయడం జరిగింది.మంగళవారం మీడియా సమావేశం కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బానోతు వీరు నాయక్ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న కరువు భత్యం, పిఆర్‌సి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, జీవో 317 ద్వారా ఇబ్బంది పడుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, పలు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్ టీటీఎఫ్ నాయకులు పాపాలాల్, సీతారాం, రమేష్, బాసు పాల్గొన్నారు.



## కామేపల్లి ప్రభుత్వ జూనియర్ ళాశాలలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**కామేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

జాతీయ సేవ పథకం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకొని కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ బీజే విద్యాసాగర్ అధ్యక్షత వహించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ఉద్దేశాలను లక్ష్యాలను అలవర్చుకొని చదువుతో పాటు తోటి వారికి సేవ చేసే మంచి స్వభావాన్ని కలిగి జీవితంలో ముందుకు సాగాలని




కోరారు.కళాశాల సీనియర్ అధ్యాపకుడు ఎం.సతీష్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడాలని తోటి వారికి సహాయడే మంచి మనసుతో ముందుకు సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పివో కె.వినోద్ బాబు, అధ్యాపకులు పి.వెంకటనారాయణ, జి.నరేష్, కె.రేవతి లక్ష్మి, ఎం.శ్రీనివాస్, డి.శ్రీనివాస్,డాక్టర్ ఎస్ కె అక్బర్ బాషా, లైబ్రేరియన్ బి.కృష్ణమూర్తి,ఎండీ రషీద్, కళాశాల సిబ్బంది,పాల్గొన్నారు.




## నెమలి మృతి అవశేషాల పై ఫారెస్టు అధికారుల విచారణ

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**



రాజేశ్వరపురం- చెన్నారం గ్రామాల మద్యన గల సాగర్ కాలువ ప్రక్కన పడి ఉన్న నెమలి చర్మం, ఈకలు, కాళ్ళు ఇతర అవశేషాల పైన మంగళవారం ఫారెస్టు అధికారులు విచారణ జరిపారు. దేశ జాతీయ పక్షిగా భావించే నెమలిని ఎవ్వరైనా వేటగాళ్ళు వేటాడి చంపి చర్మం, ఈకలు, కాళ్ళు ఇతర అవశేషాలను పారవేసి ఉంటారా లేక మరేదయినా జంతువులు దాడి చేసి చంపి ఉంటాయానేది ఈ ప్రాంత ప్రజలలో పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. సోమవారం సాగర్ కాలువ ప్రక్కన జరిగిన ఈ సంఘటనను కొందరు ఫారెస్టు అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళటంతో సదరు ఫారెస్టు అధికారులు ఈ ప్రాంతంను పరిశీలించారు. సాగర్ కాలువ ప్రక్కన గల చెరుకు తోటలను వారు తిరిగి చూసారు. ఇక్కడి సాగర్ కాలువ ప్రక్కన గల చెరకు తోటలలో నెమళ్ళు తిగే అవకాశం ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈ సందర్బంగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ డానియెల్ మాట్లాడుతూ నెమళ్ళను చంపడం నేరమని, ఎవ్వరైనా అటువంటి మూగ జీవాలను వేటాడి చంపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిఆర్‌వో కేవి రామారావు, బీట్ ఆఫీసర్‌లు కే.నర్సింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గుగ్గిళ్ళ దివ్యమూర్తిని సన్మానించిన నేలకొండపల్లి మండల తహసీల్దార్, ఎంపిడివో

### డాక్టర్ దివ్యమూర్తిని సన్మానించిన అధికారులు

**నేలకొండపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

కొత్తకొత్తూరు గ్రామంకు చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ప్రపంచ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. దీంతో మంగళవారం నేలకొండపల్లి లోని మండల తహసీల్దార్ కార్యాలయం నందు డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తిని మండల తహసీల్దార్ జే.మాణిక్‌రావు, ఎంపిడివో యం.యర్రయ్య పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తనకు ప్రపంచ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించడం సంతోషంగా ఉందని డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి చెప్పారు. తనను సన్మానించిన మండల తహసీల్దార్, ఎంపిడివోలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటి తహసీల్దార్ సయ్యద్ ఇమ్రాన్, ఎమ్మార్‌ఐలు రవికుమార్, ఆలస్యం మధుసూదనరావు, సామాజిక సేవా అవార్డుల గ్రహీత బొడ్డు బాబూరావు, సభ్యులు సూరేపల్లి జ్ఞానరత్నం, కట్టెకోల వెంకటేశ్వర్లు, పసుమర్తి గురునాథం, మారేపల్లి రామదాసు, భిక్షంనాయక్, నర్సింహారావు, వీరయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు



**ఖమ్మం నగర ఓ.ఆర్.ఆర్.కు అవసరమైన సర్వీస్‌రోడ్ల ఏర్పాటుకు చర్యలు**

**రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్,సహకార,చేనేత,జౌళీశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పునరుద్ధరణకు 100రోజుల సమయం**

**నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నూతన డిజైన్ రూపకల్పన**

**అత్యధిక జాతీయ రహదారులు ఉన్న జిల్లాగా ఉమ్మడి ఖమ్మం**

**విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

జాతీయ రహదారులతో ఖమ్మం నగరానికి రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్,సహకార,చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్దరణ చర్యలు, ఖమ్మం ఓఆర్ఆర్,సర్వీస్



రోడ్ల నిర్మాణం అంశంపై, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కుంభవృష్టి వరదల కారణంగా ఖమ్మంజిల్లా తీవ్రంగా దెబ్బతిందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావస చర్యలు చేపట్టి సాధారణ పరిస్థితులు పునరుద్ధరించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని విద్యుత్తు, త్రాగునీటి సరఫరా మొదలగు వసతులను వేగవంతంగా పునరుద్దరించడం జరిగిందని తెలిపారు. గతంలో ఎప్పుడు మున్నేరు నది చరిత్రలో 42అడుగుల వరద వచ్చినా రికార్డు లేదని దీనికి అనుగుణంగా నిపుణుల కమిటీ ఇచ్చే రిటైనింగ్ వాల్ రీడిజైనింగ్ చేయిస్తున్నామని మంత్రి తెలిపారు. ఖమ్మంనగరంలోకి వచ్చిన డ్రెయిన్ నీరు, మళ్లీ నదిలోకి ఎలా వెళ్లాలి అనేది సర్వేచేస్తున్నామని అన్నారు. వెయ్యి కోట్లకు పైగా నిధులతో ఖమ్మం కోదాడ 31 కిలోమీటర్‌ల జాతీయ రహదారి పూర్తి చేస్తామని, అదే విధంగా ఖమ్మం దేవరపల్లి జాతీయ రహదారి ఉగాది వరకు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, అమరావతి జాతీయ రహదారి, సూర్యాపేట, ఖమ్మం, రాజమండ్రి జాతీయ రోడ్ల మద్యలో 6కిలోమీటర్ల మిగులుతుందని దీనికి కూడా 120 కోట్లు మంజూరు చేసి జాతీయ రహదారి అమరావతి రోడ్డుకు కలుపుతున్నామని దీనితో ఖమ్మం నగరానికి ఔటర్‌రింగ్‌రోడ్డు రూపుదిద్దుకుంటుందన్నారు. ఖమ్మం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి సమగ్ర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పునరుద్దరణ పనులకు ప్రజలు సహకరించాలని పనులు పూర్తయ్యే వరకు బ్రిడ్జిపై ఎవ్వరిని అనుమతించమని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోనే 750కోట్ల నష్టం జరిగిందని, వీటిని తాత్కాలికంగా పునరుద్దరించేందుకు 25కోట్లు మంజూరు చేస్తామని వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అత్యధిక జాతీయ రహదారులు ఉన్న జిల్లాగా ఖమ్మం అవిర్భవిస్తుందని మంత్రి పేర్కొన్నారు. లాభదాయక పంట ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని, 3 సంవత్సరాల తరువాత మంచి ఆదాయం వస్తుందని, 3 సంవత్సరాల వరకు అంతర్ పంటల ద్వారా ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఆయిల్‌ఫామ్ పంటకు ప్రభుత్వం తరుపున భారీ స్థాయిలో సబ్సిడీ లభిస్తుందని వీటిని రైతులు వినయోగించుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో జరిగిన ఆక్రమణల తొలగింపుకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తెల్లరేషన్‌కార్డు లేని రైతులకు రుణమాఫీ పథకం అమలు చేసేందుకు రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే చేపట్టామని, దీని ప్రకారం అర్హులకు రుణమాఫీ పథకం వర్తింపచేస్తామని మంత్రి తెలిపారు. రెండు లక్షల పైన ఉన్న రైతులకు షెడ్యూల్ ఇస్తామన్నారు. వరద నష్టం క్రింద కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సహాయం అందలేదని, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి ప్రతిపాదనలు సమర్పించామన్నారు. నదీ బేసిన్ పక్కన ఉన్న పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్బన్‌లో అధికంగా ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశానని మంత్రి తెలిపారు. అనంతరం పాత్రికేయులు అడిగిన పలు ప్రశ్నలకు, సందేహాలకు మంత్రి సమాధానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్, ఆర్అండ్‌బి సిఇ మోహన్ నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పినపాక తహసీల్దార్ సస్పెన్షన్

**వివాదంలో ఉన్న భూమి అనర్హులకు బదిలీ**

పినపాక, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త



పినపాక మండల తహసీల్దార్ టి. సూర్యనారాయణపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పటేల్ మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని ఏడూళ్లబయ్యారం రెవెన్యూ పరిధిలోని ఓ రైతుకు చెందిన భూమి విషయమై భద్రాచలం ఐటిడిఏ కోర్టు పరిధిలో ఓఎస్ నెం.224/2022 కేసు విచారణలో ఉండగా ఆ భూమిపై ఎటువంటి విచారణ చేయకుండా వారసత్వ సంబంధం లేని వ్యక్తులకు బదిలీపై సంబంధిత రైతు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టి అక్రమంగా అర్హత లేని వారికి పట్టాదారు పాసు పుస్తకం ఇచ్చి అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకుగాను బాధ్యుడైన తహసీల్దార్‌ను సస్పెన్షన్ చేస్తున్నటున్నట్టు కలెక్టర్ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఏజెన్సీ మండలంలోని గిరిజన చట్టాలు అమలులో ఉండగా ఎటువంటి విచారణ జరపకుండా కోర్టు వివాదంలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దార్ సూర్యనారాయణ బదిలీ చేయడంతో కలెక్టర్ తహసీల్దార్‌పై సస్పెన్షన్ చేసినట్టు కలెక్టర్ కార్యాలయం నుంచి ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు తహసీల్దార్ సూర్యనారాయణ ప్రస్తుత ప్రదేశాన్ని వదిలి వెళ్లవద్దని ఆదేశాలలో పేర్కొన్నారు.

## రేపు చిట్యాల ఐలమ్మ జయంతి సభ

ఖమ్మం కల్చరల్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

వీరనారి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి సభను ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వీరనారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిట్యాల ఐలమ్మ కేవలం భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తికోసం మాత్రమే కాకుండా మహిళా సాధికారత కోసం కూడా తన జీవితాన్ని అంకితం చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన ఖమ్మంనగరంలో గల కిమ్స్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవసభను తలపెట్టనట్లు వివరించారు. మహిళలు ఈ సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

**నాణ్యత ప్రమాణాలతో పనుల వేగం పెంచాలి**

**ఖమ్మంలో మంత్రి పొంగులేటి సుడిగాలి పర్యటన**

**ఖమ్మంనగరంలో సిసి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**

ఖమ్మం, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:

ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాలశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో టియుఎఫ్ఐడిసి నిధులు 195.00లక్షలతో, 59వ డివిజన్ దానవాయిగూడెంలో 200.00లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల



శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి సంక్షేమం దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తుందన్నారు. అభివృద్ధిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్‌లో రెండు కోట్ల నిధులతో 12 సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో కోటి 30లక్షలకు డ్రైయిన్, కొన్ని రోడ్ల పనులు చేపట్టామని అవి నేడు చివరి దశకు చేరుకున్నాయని మంత్రి



అన్నారు. స్మశాన వాటిక నిర్మాణానికి నిధులను కూడా మంజూరు చేసుకున్నామని టెండర్ పూర్తి చేశామని, త్వరలో ఆ పనులు పూర్తవుతాయని వాటితో పాటు కేఆర్ ఫంక్షన్‌హాల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. నేడు శంకుస్థాపన చేసుకున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో 2 నెలల కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను ప్రభుత్వంతీసుకొని అర్హులైన పేదలకు పంచడం జరుగుతుందన్నారు. దేవాదాయ, రెవెన్యూ భూములకు సంబంధించి ఎవరు పోజిషన్‌లో ఉన్నా యుద్ధప్రాతిపదికన రిటర్న్ తీసుకోవాలని మంత్రి రెవెన్యూ డివిజన్ అధికారి ఆదేశించారు. అనంతరం మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలైన జలగంనగర్, రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలనీ, కరుణగిరి ప్రాంతాలలో మంత్రి మోటర్ సైకిల్‌పై వీధి వీధి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్నేరు వరద బాధితులను సంపూర్ణంగా ఆదుకుంటామని, వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి పరిహారం అందజేస్తామని, ఆస్తి, పశునష్టం జరిగిన వాటికి పరిహారాన్ని అందజేస్తామన్నారు. అధికారులు ముంపు ప్రాంతాల్లోనే సహాయక కేంద్రం మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి, సర్టిఫికెట్లే కోల్పోయిన వారికి అందజేస్తామన్నారు. ముంపు వల్ల అపరిశుభ్రమైన ప్రదేశాలను పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, అధికారులు మరోమారు సందర్శించి నష్టపోయిన ప్రతిఒక్కరికి న్యాయం చేస్తారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, మున్సిపల్ డిఇ ధరణి, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.